


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 225 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు సోమవారం 20 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥
VOLUME :1 ISSUE :225 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE MON 20 APRIL 2026 PRICE : 1/- RS
Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## క్రమంగా కోలుకుంటున్నాను.. మీ అందరి ఆదరణకు కృతజ్ఞతలు

- హైదరాబాద్‌లో శనివారం నాడు సర్జరీ చేయించుకున్న పవన్ కల్యాణ్
- తన ఆరోగ్యం నిలకడగా ఉందని, క్రమంగా కోలుకుంటున్నానని వెల్లడి
- సందేశాలు పంపిన రాజకీయ, సినీ ప్రముఖులకు పేరుపేరునా కృతజ్ఞతలు
- అన్నయ్య చిరంజీవి, నాగబాబు పోస్టులకు భావోద్వేగంగా స్పందించిన పవన్
- మాజీ సీఎం జగన్ విషెస్‌కు సైతం ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపిన జనసేనాని

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తాను క్రమంగా కోలుకుంటున్నానని వెల్లడించారు. ఇటీవల హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో శనివారం నాడు శస్త్రచికిత్స విజయవంతంగా జరిగింది. పవన్ కల్యాణ్ కొంతకాలంగా సైనసైటిస్ సమస్యతో బాధపడుతున్నట్టు తెలుస్తోంది. సర్జరీ విజయవంతమైన నేపథ్యంలో తన ఆరోగ్యం త్వరగా కుదుటపడాలని ఆకాంక్షించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సినీ ప్రముఖులతో పాటు యావత్ ప్రజానీకానికి ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. పలువురు నేతల ట్వీట్లకు స్పందిస్తూ, తన ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిపై ఆయన

- మిగతా2లో




## పారదర్శకంగా ఉన్నాం.. ప్రజలకు వాస్తవాలు చేరవేయండి

- పార్టీ ముఖ్య నేతలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపు
- ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమం, అభివృద్ధిలో రాజీపడటం లేదు
- శిక్షణా తరగతులతో లీడర్-కేడర్ మధ్య భావోద్వేగ బంధం
- ఈ నెల 29న టీడీపీ నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ
- ప్రజలే ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలి: సీఎం



**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్ర ప్రభుత్వం పూర్తి పారదర్శకతతో పనిచేస్తోందని, ఈ వాస్తవాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, ప్రత్యర్థులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సంక్షేమం, అభివృద్ధి, ప్రభుత్వ సేవల విషయంలో తాము అనుసరిస్తున్న పారదర్శక విధానాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత నేతలపై ఉందని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న పార్టీ ముఖ్య నేతలతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి, తాజా రాజకీయ పరిణామాలపై సమీక్షించారు.రాష్ట్రం ఆర్థికంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నప్పటికీ, వాటిని ఒక్కొక్కటిగా అధిగమిస్తూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడకుండా ముందుకెళుతున్నామని చంద్రబాబు వివరించారు. ఈ కష్టాన్ని, ప్రభుత్వం పడుతున్న శ్రమను ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని సూచించారు. ప్రభుత్వంపైనా, కూటమి పార్టీలపైనా కొందరు పనిగట్టుకుని అసత్యాలు ప్రచారం చేస్తున్నారని, వివిధ మార్గాల ద్వారా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే ప్రయత్నం చేస్తున్నారని, ఈ కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని స్పష్టం చేశారు.

“ప్రజలకు వాస్తవాలు తెలిస్తే వారే విశ్లేషించుకుంటారు. పరిపాలనలో ప్రభుత్వం పడుతున్న కష్టాన్ని వారికి వివరిస్తే, ప్రత్యర్థుల కుట్రలను తిప్పికొట్టేలా ప్రజలే ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారతారు” అని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. గత ఎన్నికల్లో నాటి ప్రభుత్వం ఎన్ని అణచివేత చర్యలకు పాల్పడినా, ప్రజలు వాస్తవాలను గ్రహించి కూటమికి అద్భుతమైన విజయాన్ని అందించారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. వాస్తవాలను ప్రజలకు తెలియజేయడమే మన ప్రధాన బాధ్యత అని ఆయన అన్నారు.పార్టీలో నేతలకు, కార్యకర్తలకు మధ్య భావోద్వేగ బంధాన్ని బలోపేతం చేసేందుకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు, ‘కాఫీ కబుర్లు’ వంటి కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తున్నాయని చంద్రబాబు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తరగతుల ద్వారా పార్టీ సిద్ధాంతాలను వివరించడంతో పాటు, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఫీడ్‌బ్యాక్ తీసుకునే అవకాశం కలుగుతోందని తెలిపారు. పార్టీ కార్యకర్తల కుటుంబాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, వారి విద్య, వైద్యం, ఉపాధి కోసం ‘ఎథిక్ ఎకనమిక్ ఎంపవర్‌మెంట్’ అనే వ్యవస్థను సమగ్రంగా తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు.ఈ నెల 29వ తేదీన పార్టీ నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించనుందని, దీనికి సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయని నేతలు ముఖ్యమంత్రికి తెలియజేశారు. అలాగే, త్వరలో జరగనున్న మహానాడు నిర్వహణ కమిటీల ఏర్పాటుపైనా కసరత్తు చేస్తున్నట్టు సీఎంకు వివరించారు.



ఒప్పందానికి ఒప్పుకోకపోతే

## విధ్వంసమే..

ఇరాన్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరిక!

- ఇరాన్‌లోని ప్రతి విద్యుత్ కేంద్రం, వంతెనను కూల్చేస్తామన్న అమెరికా
- సోమవారం ఇస్లామాబాద్‌లో ఇరు దేశాల మధ్య మరో విడత చర్చలు
- హార్ముజ్ జలసంధిలో కాల్పుల విరమణను ఇరాన్ ఉల్లంఘించిందని ఆరోపణ
- విఫలమైన గత చర్చల తర్వాత పశ్చిమాసియాలో పెరిగిన ఉద్రిక్తతలు

- మిగతా2లో

## పవన్ కల్యాణ్ గారూ... మీరు త్వరగా కోలుకోవాలి

- శస్త్రచికిత్స చేయించుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- ఆయన త్వరగా కోలుకోవాలంటూ ఆకాంక్షించిన జగన్
- సోషల్ మీడియా వేదికగా స్పందించిన మాజీ సీఎం
- హైదరాబాద్‌లో పవన్‌కు విజయవంతంగా ముగిసిన సర్జరీ

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ శనివారం సాయంత్రం శస్త్రచికిత్స చేయించుకున్న నేపథ్యంలో, వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ స్పందించారు. పవన్ త్వరగా, సంపూర్ణంగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ

- మిగతా2లో



## హైదరాబాద్ పోలీసుల ‘ఆపరేషన్ ఆక్టోపస్ 2.0’.. దేశవ్యాప్తంగా 52 మంది అరెస్ట్

- అరెస్టయిన వారిలో 32 మంది బ్యాంకు అధికారులు
- 9 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించిన 16 ప్రత్యేక బృందాలు
- మ్యూల్ ఖాతాలు తెరవడంలో అధికారుల పాత్ర ఉన్నట్లు నిర్ధారణ
- ఫిబ్రవరిలో జరిగిన ఆపరేషన్ ఆక్టోపస్-1కు ఇది కొనసాగింపు

- మిగతా2లో





## చెన్నై సూపర్ 6...

### 20 పాయింట్ల ప్రత్యేక మేనిఫెస్టో విడుదల చేసిన స్టాలిన్

- చెన్నై జిల్లాకు ‘సూపర్ 6’ పేరుతో ప్రత్యేక మేనిఫెస్టో
- ఆరు కీలక రంగాల్లో 20 ప్రధాన ప్రకటనలు
- 1000 కొత్త మినీ బస్సులు, ఏఐ ఆధారిత ట్రాఫిక్ వ్యవస్థ
- మౌలిక వసతుల ప్రాజెక్టులకు కచ్చితమైన గడువులు
- రూ.10,000 కోట్లతో గ్లోబల్ సెంటర్, 20,000 ఉద్యోగాల కల్పన

**పెన్ పవర్ డెస్క్:**తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, చెన్నై జిల్లాను లక్ష్యంగా చేసుకుని ‘చెన్నై సూపర్ 6’ పేరుతో ఒక ప్రత్యేక ఎన్నికల మేనిఫెస్టోను ఆదివారం విడుదల చేశారు. నగర మౌలిక సదుపాయాలు, రవాణా, పట్టణ సౌకర్యాలు, భవిష్యత్ ఆర్థిక వృద్ధి వంటి ఆరు కీలక రంగాల్లో మొత్తం 20 హామీలను ఇందులో పొందుపరిచారు.పట్టణ రవాణా వ్యవస్థను మెరుగుపరచడంలో భాగంగా, చివరి మైలు కనెక్టివిటీ కోసం 1,000 కొత్త మినీ బస్సులను ప్రవేశపెట్టనున్నట్లు డీఎంకే హామీ ఇచ్చింది.

- మిగతా2లో



## తమిళనాడులో ఘోర విషాదం...

### బాణసంచా పరిశ్రమలో పేలుడు, 18 మంది మృతి

- తమిళనాడు విరుధునగర్‌లో భారీ పేలుడు
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆందోళన
- దుర్ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం స్టాలిన్
- సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశం

- మిగతా2లో

## నేడు చంద్రబాబు పుట్టినరోజు...

### అన్న క్యాంటీన్ల కు రూ.76 లక్షల విరాళం ఇచ్చిన నారా భువనేశ్వరి

- ఏప్రిల్ 20న పుట్టినరోజు జరుపుకోనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- నేడు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 269 అన్న క్యాంటీన్లలో పేదలకు ఉచితంగా భోజనం
- ఈ ఏడాది మీ పుట్టినరోజు బహుమానం ఇదే” అంటూ ఆమె చంద్రబాబుకు భువనేశ్వరి విషెస్
- అర్ధాంగిని అభినందించిన సీఎం చంద్రబాబు

- మిగతా2లో



## రంగులు మార్చడంలో నరేంద్ర మోదీజీ అభినవ ఊసరవెల్లి

- మహిళా బిల్లుపై ప్రధాని మోదీ రంగులు మారుస్తున్నారని షర్మిల విమర్శ
- రిజర్వేషన్ల అమలుకు డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం కుట్రేనని ఆరోపణ
- చట్టాన్ని వెంటనే అమలు చేసి 543 స్థానాలకు వర్తింపజేయాలని డిమాండ్
- 2029 లోపు కులగణన, శాస్త్రీయ పునర్విభజన పూర్తి చేయాలని సవాల్

**పెన్ పవర్ డెస్క్:**మహిళా రిజర్వేషన్ బిల్లు విషయం లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినవ ఊసరవెల్లిలా రంగులు మారుస్తున్నారని, 33 శాతం రిజర్వేషన్ల అమలుకు అసలు ద్రోహి ఆయనేనని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో

- మిగతా2లో



## ఎడిటర్ వ్యూ

# తెలుగు ఓటర్లే టార్గెట్.. ఎన్డీఏకి మద్దుతగా రంగంలోకి చంద్రబాబు

తమిళనాడు ఎన్నికలకు కీలక దశకు చేరుకున్నాయి. మరో నాలుగు రోజుల్లో పోలింగ్ జరగనుండగా, మంగళవారంతో ఎన్నికల ప్రచారం ముగియనుంది. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంట్రీ ఇస్తున్నారు. రెండు రోజుల పాటు తమిళనాడులో ఎన్నికల ప్రచారం చేసేందుకు ఎన్డీఏ తరఫున చంద్రబాబు పర్యటిస్తున్నారు. సోమ, మంగళవారాల్లో ఆయన తమిళనాడులో పలు బహిరంగ సభలు, రోడ్ షోలు నిర్వహించనున్నారు. చంద్రబాబు ఎన్నికల ప్రచారం రాజకీయంగా ఆసక్తిరేపుతోంది.

తమిళనాడులో ఎన్డీఏ కూటమి తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ప్రచారం చేయనున్నారని టీడీపీ వర్గాలు ప్రకటించాయి. ఈ మేరకు సీఎం టూర్ ను అధికారికంగా ధ్రువీకరించారు. సోమవారం మధ్యాహ్నం రాజధాని అమరావతి నుంచి చంద్రబాబు నేరుగా కోయంబత్తూరు వెళ్లనున్నారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కోయంబత్తూరు, హోసూరు, చెన్నై, ఆవడి ప్రాంతాల్లో పర్యటిస్తారు. ముఖ్యంగా తెలుగు ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు సభలు, రోడ్ షోలకు ఏర్పాట్లు చేశారు. చంద్రబాబు పర్యటన సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. హోసూరు సమీపంలో తాలిలో భారీ బహిరంగ సభ నిర్వహణకు ప్లాన్ చేశారు. ఈ ప్రాంతంలో తెలుగు వాళు అధికంగా నివసిస్తున్నట్లు చెబుతున్నారు. ఇక చెన్నైకి సమీపంలో ఆవడిలో చంద్రబాబు రోడ్ షో కి రూట్ మ్యాప్ రెడీ చేశారు. ఇక చంద్రబాబు రాకను స్వాగతిస్తూ ఎన్డీఏ అభ్యర్థులు పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. చెన్నై టీడీపీ కూడా చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయడానికి విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఏపీ-తమిళనాడు సరిహద్దుల్లో తెలుగు మాట్లాడేవారు అధికంగా నివసిస్తున్నారు. అంతేకాకుండా చెన్నై, కోయంబత్తూరు, తిరుచ్చి వంటి నగరాల్లో తెలుగు మాట్లాడే వారి జనాభా ఎక్కువగా ఉందని అంచనా. తమిళనాడులో దాదాపు 40 శాతం మంది తెలుగు సంతతికి చెందిన ఓటర్లే ఉన్నారని గణాంకాలు చెబుతున్నాయి. దీంతో ఈ ఎన్నికల్లో పలువురు తెలుగు నేతలకు ప్రధాన పార్టీలు టికెట్లు ఇచ్చాయి. ఇక ఎన్డీఏ భాగస్వామిగా ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబును బీజేపీ రంగంలోకి దింపిందని అంటున్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో అత్యంత సీనియర్ నేతగా చంద్రబాబు ప్రభావం ఉంటుందని ఎన్డీఏ నేతలు భావిస్తున్నారు. అంతేకాకుండా చంద్రబాబుకు తమిళనాడుతో ఉన్న అనుబంధం, ఏపీ నుంచి వచ్చి తమిళనాడులో స్థిరపడిన ఓటర్లను ఆకర్షించడానికి చంద్రబాబు ద్వారా ప్రయత్నాలు చేస్తున్నట్లు వ్యాఖ్యానిస్తున్నారు. గతంలో కూడా చంద్రబాబు మహారాష్ట్ర, ఢిల్లీ ఎన్నికల్లో ప్రచారం నిర్వహించారు. ఆ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేశారు. తాజాగా సరిహద్దు రాష్ట్రమైన తమిళనాడులో చంద్రబాబును ప్రత్యేకంగా తీసుకువెళ్లడం హాట్ టాపిక్ గా మారింది.

## పవన్ కల్యాణ్ గారూ... మీరు త్వరగా కోలుకోవాలి

- మొదటి పేజి తరువాయి

సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పవన్ కల్యాణ్ కు నిన్న హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ సర్జరీ విజయవంతం అయిందని, ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారని తెలిసింది. ఈ క్రమంలో పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు, అభిమానులు ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగిరావాలని సోషల్ మీడియా వేదికగా ఆకాంక్షలు తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలోనే జగన్ కూడా స్పందించారు. "పవన్ కల్యాణ్ గారు శస్త్రచికిత్స అనంతరం త్వరగా, సంపూర్ణంగా కోలుకోవాలని ఆశిస్తున్నాను" అని తన పోస్టులో జగన్ పేర్కొన్నారు.

# క్రమంగా కోలుకుంటున్నాను.. మీ అందరి ఆదరణకు కృతజ్ఞతలు

- మొదటి పేజి తరువాయి

సోదరుడు, మెగాస్టార్ చిరంజీవి ఎక్స్ వేదికగా స్పందించారు. "కల్యాణ్ బాబుకు వైద్య ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. ప్రస్తుతం ఆయన క్షేమంగా, నిలకడగా కోలుకుంటున్నారు. వైద్యుల సూచన మేరకు, సాధారణ కార్యకలాపాల్లోకి తిరిగి రావడానికి సుమారు వారం రోజులు పట్టవచ్చు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మీ అందరి ప్రేమకు, ప్రార్థనలకు ధన్యవాదాలు" అని చిరంజీవి పేర్కొన్నారు. దీనికి పవన్ కల్యాణ్ స్పందిస్తూ, "ధన్యవాదాలు అన్నయ్య. మీ ప్రేమ, ఆశీస్సులు, నిరంతర సంరక్షణకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. మీ మాటలు వెచ్చదనాన్ని, రక్షణను, బలాన్ని ఇస్తాయి. మీ ఆశీస్సులతో త్వరలోనే కోలుకుని తిరిగి ప్రజాసేవకు వస్తాను" అని బదులిచ్చారు. మరో సోదరుడు, జనసేన ఎమ్మెల్సీ నాగబాబు కూడా పవన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. "మన ప్రియతమ నాయకుడు పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స విజయవంతమైంది. ఆయన కొన్ని రోజులు విశ్రాంతి తీసుకుని, నూతన శక్తితో తిరిగి వస్తారు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని మనమందరం ప్రార్థిద్దాం" అని పోస్ట్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి కూడా పవన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఎక్స్ లో పోస్ట్ చేశారు. దీనికి పవన్ స్పందిస్తూ, "నా ఆరోగ్యం, కోలుకోవడం కోసం మీరు తెలిపిన శుభాకాంక్షలకు ధన్యవాదాలు వైఎస్ జగన్ గారూ. నేను క్రమంగా కోలుకుంటున్నాను. మీ ఆదరణకు కృతజ్ఞుడను" అని బదులిచ్చారు. వీరితో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, భూపతిరాజు శ్రీనివాస వర్మ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, నారాయణ, అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు పవన్ కల్యాణ్ కోలుకోవాలం తమ సందేశాల్లో పేర్కొన్నారు. సినీ పరిశ్రమ నుంచి జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్, సాయి ధరమ్ తేజ్ వంటి ప్రముఖులు కూడా ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అందరి ప్రేమ, ఆప్యాయతలకు పవన్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం పవన్ కల్యాణ్ ఆరోగ్యం నిలకడగా ఉందని, పూర్తి విశ్రాంతి అనంతరం త్వరలోనే విధుల్లో చేరతారని జనసేన వర్గాలు తెలిపాయి.

## హైదరాబాద్ పోలీసుల 'ఆపరేషన్ ఆక్టోపస్ 2.0'..

# దేశవ్యాప్తంగా 52 మంది అరెస్ట్

దేశవ్యాప్తంగా విస్తరించిన భారీ సైబర్ మోసాల నెట్‌వర్క్‌ను హైదరాబాద్ నగర పోలీసులు ఛేదించారు. 'ఆపరేషన్ ఆక్టోపస్ 2.0' పేరుతో చేపట్టిన ఈ ఆపరేషన్‌లో భాగంగా 9 రాష్ట్రాల్లో 32 మంది బ్యాంకు అధికారులతో సహా మొత్తం 52 మందిని అరెస్టు చేశారు. ఈ వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ ఆదివారం మీడియాకు వెల్లడించారు.

వారం రోజుల పాటు 16 ప్రత్యేక పోలీసు బృందాలు మహారాష్ట్ర, ఢిల్లీ, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్ రాష్ట్రాల్లో ఏకకాలంలో ఈ ఆపరేషన్ నిర్వహించాయి. అరెస్టయిన వారిలో సైబర్ నేరగాళ్లకు సహకరించిన 32 మంది బ్యాంకు అధికారులు, మోసపూరిత లావాదేవీల కోసం తమ ఖాతాలను వాడటానికి అనుమతించిన 15 మంది మ్యూల్ ఖాతాదారులు, నేరగాళ్లకు ఈ ఖాతాలను అందించే ఐదుగురు మధ్యవర్తులు ఉన్నారు. ఇండస్‌ఇండ్ బ్యాంకుకు చెందిన ఆరుగురు, బంధన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడాకు చెందిన ఐదుగురు చొప్పున, ఫెడరల్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకుకు చెందిన నలుగురు చొప్పున అధికారులతో పాటు మరో ఐదు ప్రైవేట్ బ్యాంకులకు చెందిన అధికారులు కూడా అరెస్టయిన వారిలో ఉన్నారు. నిందితుల నుంచి 26 మొబైల్ ఫోన్లు, 14 చెక్ బుక్కులు, ఒక ల్యాప్‌టాప్, 21 షెల్ కంపెనీ స్టాంపులను స్వాధీనం చేసుకున్నారు.

పెట్టుబడుల మోసాలు, ట్రేడింగ్ ఫ్రాడ్స్, 'డిజిటల్ అరెస్ట్' వంటి సైబర్ నేరాలు పెరిగిపోవడంతో ఈ ఆపరేషన్ చేపట్టామని సజ్జనార్ తెలిపారు. ఫిబ్రవరి 2026లో 'ఆపరేషన్ ఆక్టోపస్-1' ద్వారా రూ. 150 కోట్ల లావాదేవీలకు సంబంధించిన 117 మందిని అరెస్ట్ చేశామని, దానికి కొనసాగింపుగా బ్యాంకు అధికారులను లక్ష్యంగా చేసుకుని ఈ ఆపరేషన్ ప్రారంభించామని వివరించారు. సరైన కేవైసీ ధృవీకరణ లేకుండానే మ్యూల్ ఖాతాలు తెరుస్తూ సైబర్ నేరగాళ్లకు ప్రైవేట్ బ్యాంకులు సహకరిస్తున్నట్లు తమ దర్యాప్తులో తేలిందని కమిషనర్ పేర్కొన్నారు.

# రంగులు మార్చడంలో నరేంద్ర మోదీజీ అభినవ ఊసరవెల్లి

- మొదటి పేజి తరువాయి

ధ్వజమెత్తారు. నారీశక్తి ముసుగులో డీలిమిటేషన్ బిల్లును తెరపైకి తెచ్చిన కపట సూత్రధారి మోదీ అని, ఇప్పుడు ప్రతిపక్షాలపై పెడబొబ్బలు పెడుతూ మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆమె విమర్శించారు.

సోషల్ మీడియాలో ఆమె స్పందిస్తూ.. "2023లో పార్లమెంట్ ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని వెంటనే అమలు చేయకుండా, దానికి నియోజకవర్గాల పునర్విభజనతో లింకు పెట్టాల్సిన అవసరం ఏమొచ్చింది? మళ్లీ సవరణ బిల్లు తెచ్చి, ప్రతిపక్షాలు అడ్డుకున్నాయని బీద ఏడుపులు ఎందుకు? రాజకీయ స్వలాభం కోసం విపక్షాలపై శాపనార్థాలు పెట్టడం దేనికి?" అని ప్రధానిని సూటిగా ప్రశ్నించారు.

ప్రధాని మోదీకి మహిళల ఆత్మగౌరవంపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే, 'నారీ శక్తి వందన్ అధినియమ్-2023' చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీలిమిటేషన్‌తో ఎలాంటి సంబంధం లేకుండా ప్రస్తుతమున్న 543 పార్లమెంట్ స్థానాల్లోనే మహిళా రిజర్వేషన్లు పాటించాలని కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ అత్యంత శాస్త్రీయంగా జరగాలని షర్మిల అభిప్రాయపడ్డారు. "ముందుగా 2026 జనాభా లెక్కలు అందుబాటులోకి రావాలి. ఆ తర్వాత కులగణన జరిపి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల జనాభా తేల్చాలి. ఈ గణాంకాల ఆధారంగానే డీలిమిటేషన్‌లో రిజర్వేషన్లు కేటాయించాలి. వెనుకబడిన కులాలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించి న్యాయం చేయాలి. చిన్న రాష్ట్రాల వాదనలను పరిగణనలోకి తీసుకొని ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపాలి. బీజేపీకి దమ్ముంటే 2029 ఎన్నికలలోపు ఈ ప్రక్రియ మొత్తం పూర్తి చేయాలి" అని ఆమె సవాల్ విసిరారు.

"శాశ్వత అధికారం కోసం రాజ్యాంగాన్ని మార్చాలన్న బీజేపీ కుతంత్రాన్ని అడ్డుకోవడంలో విపక్షాలు విజయం సాధిస్తే, ఆడలేక మద్దెల ఓడు అన్నట్లు మహిళలను అడ్డుపెట్టుకుని మోదీ మాట్లాడటం సిగ్గుచేటు. 2029 ఎన్నికల్లో లబ్ధి కోసం రాష్ట్రాల సమైక్యతను దెబ్బతీయాలని చూస్తే విపక్షం గుణపాఠం చెబుతుంది" అని షర్మిల హెచ్చరించారు.

చేతనైతే మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేసి చూపాలని, శాస్త్రీయ పద్ధతిలో పునర్విభజన చేపట్టాలని ప్రధాని మోదీకి, మతతత్వ బీజేపీకి, ఎన్డీఏ పక్షాలకు కాంగ్రెస్ పార్టీ తరఫున సవాల్ విసురుతున్నానని ఆమె స్పష్టం చేశారు.

## నేడు చంద్రబాబు పుట్టినరోజు...

# అన్న క్యాంటీన్ల కు రూ.76 లక్షల విరాళం ఇచ్చిన నారా భువనేశ్వరి

రాష్ట్రంలో పేదల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లు, అన్నం పెట్టే అమ్మను తలపిస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అర్ధాంగి నారా భువనేశ్వరి అన్నారు. రేపు (ఏప్రిల్ 20) ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని ఆమె అన్న క్యాంటీన్లకు రూ.76 లక్షల భారీ విరాళాన్ని ప్రకటించారు. ఈ విరాళంతో రేపు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 269 అన్న క్యాంటీన్లలో పేదలకు ఉచితంగా భోజనం అందించనున్నారు. శనివారం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో అన్న క్యాంటీన్ సీఈవోకు ఆమె చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ.. లక్షల మంది పేదల కడుపు నింపే మహోన్నత కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం తిరిగి ప్రారంభించడం ఎంతో గొప్ప విషయమన్నారు. కేవలం రూ.5 లకే అత్యంత పరిశుభ్రమైన వాతావరణంలో, గౌరవంగా భోజనం అందించడం అభినందనీయమని కొనియాడారు. రోజువారీ కూలీలు, నిరుపేదలు ఈ పథకం ద్వారా ఎంతో లబ్ధి పొందుతున్నారని, ఏ ఒక్కరూ ఆకలితో ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. చంద్రబాబు పుట్టినరోజున పేదల కడుపు నింపే కార్యక్రమానికి విరాళం ఇవ్వడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని ఆమె పేర్కొన్నారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం కన్నా మించిన సంతృప్తి మరొకటి ఉండదని, తాను పలు సందర్భాల్లో అన్న వితరణలో పాల్గొన్నప్పుడు కలిగిన అనుభూతిని గుర్తుచేసుకున్నారు. తమ మనవడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా కూడా 12 ఏళ్లుగా ఏటా తిరుమల అన్నప్రసాదానికి రూ.44 లక్షలు విరాళంగా ఇస్తున్న విషయాన్ని ఆమె ప్రస్తావించారు. "ఈ ఏడాది మీ పుట్టినరోజుకు మేమిచ్చే బహుమానం ఇదే" అంటూ ఆమె చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మరోవైపు, తన పేరు మీద అన్న క్యాంటీన్లకు ఒక రోజు అన్నదానానికి భారీ విరాళం ఇచ్చిన అర్ధాంగి భువనేశ్వరిని ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "రాష్ట్రంలో అన్నదాన కార్యక్రమాన్ని ఒక గొప్ప యజ్ఞంలా ముందుకు తీసుకెళుతున్నాం. తిరుమలలో భక్తుల సహకారంతో నాలుగు దశాబ్దాలుగా అన్నదానం జరుగుతోంది. అదే స్ఫూర్తితో అన్న క్యాంటీన్ల సేవలను మరింత విస్తరించాలి" అని అన్నారు. నాణ్యతను పాటిస్తూ, పవిత్రంగా, గౌరవంగా ఆహారం అందించే ఈ కార్యక్రమానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి ప్రత్యేక సందర్భాల్లో భోజనానికి అయ్యే ఖర్చును విరాళంగా ఇచ్చేందుకు ప్రజలు ముందుకు రావాలని, తద్వారా ఈ కార్యక్రమం ఒక స్ఫూర్తిదాయక బ్రాండ్‌గా మారాలని ఆకాంక్షించారు.

# తమిళనాడులో ఘోర విషాదం...

తమిళనాడులో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. విరుధునగర్ జిల్లా, కట్టనార్‌పట్టిలోని ఓ బాణసంచా ఫ్యాక్టరీలో ఆదివారం భారీ విస్ఫోటనం సంభవించింది. ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు 18 మంది కార్మికులు మరణించినట్లు తెలుస్తోంది.

ప్రమాద తీవ్రతకు మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫ్యాక్టరీలో ఒక్కసారిగా పేలుడు సంభవించడంతో కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. అయితే, విస్ఫోటనానికి దారితీసిన కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు.

ఈ దుర్ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. "కట్టనార్‌పట్టి బాణసంచా ఫ్యాక్టరీలో జరిగిన విస్ఫోటనంలో పలువురు మరణించారన్న వార్త తీవ్ర వేదనకు గురిచేసింది" అని ఆయన తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాలని మంత్రులు కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, తంగం తెన్నరసులను సీఎం స్టాలిన్ ఆదేశించారు. బాధితుల కుటుంబాలకు అండగా నిలవాలని సూచించారు. జిల్లా కలెక్టర్‌తో కూడా మాట్లాడి, అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

# ఒప్పందానికి ఒప్పుకోకపోతే విధ్వంసమే..

- మొదటి పేజి తరువాయి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్‌కు మరోసారి తీవ్రమైన హెచ్చరిక లు జారీ చేశారు. ఒప్పందానికి అంగీకరించకపోతే ఇరాన్‌లోని ప్రతి విద్యుత్ కేంద్రాన్ని, ప్రతి వంతెనను నాశనం చేస్తామని స్పష్టం చేశారు. అయితే, ఇదే సమయంలో ఇరు దేశాల మధ్య చర్చల కోసం రేపు (ఏప్రిల్ 20న) అమెరికా ప్రతినిధి బృందం పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌కు వెళ్లనుందని వెల్లడించారు. ఈ మేరకు ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ ఒక పోస్ట్ చేశారు. "మేం చాలా న్యాయమైన ఒప్పందాన్ని ప్రతిపాదిస్తున్నాం. దానికి వారు అంగీకరిస్తారని ఆశిస్తున్నాం. ఒకవేళ ఒప్పుకోకపోతే, ఇరాన్‌లోని ప్రతి విద్యుత్ కేంద్రాన్ని, ప్రతి వంతెనను అమెరికా కూల్చేస్తుంది. ఇకపై మంచిగా వ్యవహరించేది లేదు" అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇరాన్ హంతక యంత్రాంగాన్ని అంతం చేసే సమయం వచ్చిందని, గత 47 ఏళ్లుగా ఇతర అధ్యక్షులు చేయలేని పనిని తాను చేస్తానని అన్నారు. గతంలో ఏప్రిల్ 11న ఇస్లామాబాద్‌లో పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో జరిగిన చర్చలు విఫలమయ్యాయి. ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిలిపివేయాలని అమెరికా డిమాండ్ చేయగా, తమపై విధించిన ఆంక్షలు ఎత్తివేసి, స్తంభింపజేసిన ఆస్తులను విడుదల చేయాలని ఇరాన్ కోరింది. ఆ చర్చలు విఫలమవ్వడంతో హర్మూజ్ జలసంధిలో అమెరికా నావికాదళ దిగ్బంధనం విధించగా, దానికి ప్రతిగా ఇరాన్ ఆ జలసంధిని మూసివేసింది. కాగా, హర్మూజ్ జలసంధిలో ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ట్రంప్ ఆదివారం ఆరోపించారు. ఫ్రాన్స్, బ్రిటన్‌కు చెందిన నౌకలపై ఇరాన్ కాల్పులు జరిపిందని తెలిపారు. జలసంధిని మూసివేయడం వల్ల ఇరాన్‌కే రోజుకు 500 మిలియన్ డాలర్ల నష్టం వాటిల్లుతుందని అన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరిన నేపథ్యంలో సోమవారం జరగనున్న చర్చలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## చెన్నై సూపర్ 6... 20 పాయింట్ల ప్రత్యేక మేనిఫెస్టో విడుదల చేసిన స్టాలిన్

- మొదటి పేజి తరువాయి

ఈ బస్సులు వీధులను బస్టాప్‌లు, మెట్రో స్టేషన్లు, రైల్వే హబ్‌లతో కలుపుతాయి. దీనికి తోడు, ట్రాఫిక్ రద్దీని తగ్గించి, ప్రయాణ సమయాన్ని 25 శాతం వరకు తగ్గించేందుకు ఏఐ (ఏఐ) ఆధారిత ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను తీసుకొస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. కీలకమైన మౌలిక వసతుల ప్రాజెక్టుల పూర్తికి స్పష్టమైన గడువులను నిర్దేశించారు. ఎన్నూర్ నుంచి పూంజేరి వరకు చెన్నై పెరిఫెరల్ రోడ్ ప్రాజెక్టుతో సహా పదికి పైగా ప్రధాన పథకాలను 2027 నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. మెట్రో రైలు విస్తరణ, స్టార్మ్ వాటర్ డ్రెయిన్ పనులను 2028 నాటికి, భూగర్భ డ్రైనేజీ ప్రాజెక్టులను 2027 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2029 నాటికి ప్రపంచ స్థాయి రహదారి మౌలిక వసతులను కల్పిస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్ ఆర్థిక వ్యవస్థను దృష్టిలో ఉంచుకుని, రూ.10,000 కోట్ల పెట్టుబడితో 'గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఏఐ, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్ వంటి రంగాలపై దృష్టి సారించే ఈ కేంద్రం ద్వారా 20,000 అధిక వేతన ఉద్యోగాలను సృష్టిస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు, వీధికుక్కల సమస్యకు శాస్త్రీయ పరిష్కారంగా, యానిమల్ బెర్త్ కంట్రోల్ కార్యక్రమాన్ని బలోపేతం చేస్తామని, వెటర్నరీ వైద్యులు, డాగ్ క్యాచర్ల సంఖ్యను మూడు రెట్లు పెంచుతామని తెలిపారు. వీటితో పాటు, మెట్రో వాటర్ కనెక్షన్లు లేని ప్రాంతాల్లో ఆర్వో ప్లాంట్లు, అన్ని నివాస ప్రాంతాల్లో హై-ఇంటెన్సిటీ వీధి దీపాలు వంటి హామీలను కూడా ఈ మేనిఫెస్టోలో పొందుపరిచారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# అక్రమ కేసులతో వైస్సార్సీపీ బయపెట్టలేరు

## చెంచాలతో, చెంచాగిరితో దిగ జారుడు రాజకీయాలు తగవు.. ఎమ్మెల్యే తాటిపర్తి

### పోలీస్ స్టేషన్‌లో ఉద్రిక్త వాతావరణం





**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ ఏప్రిల్ 19**

అవినీతిని ప్రశ్నిస్తూ ప్రభుత్వతప్పులను ఎత్తి చూపుతూ సోషల్ మీడియా లో చైతన్యం తెస్తున్న వైస్సార్సీపీ సోషల్ మీడియా కార్యకర్తల పై అక్రమ కేసులు పెడితే భయపడేది లేదని, చెంచాలతో, చెంచాగిరి రాజకీయాలు తగవని వైస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. వైసీపీ ఐటి వింగ్ నాయకులపై టీడీపీ నాయకులు పెట్టిన కేసులను తీవ్రంగా ఖండిస్తూ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆదివారం నాయకులతో కలిసి ప్లే కార్డ్స్ ప్రదర్శిసిస్తూ పట్టణంలో వైసీపీ కార్యాలయం నుండి పోలీస్ స్టేషన్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు.కాసేపు స్టేషన్ లో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.ఇటీవల హైదరాబాద్ లో జరిగిన ఓ సంఘటనలో అక్కడ పోలీసులు ఎమ్మెల్యేను దవడ పగలగొట్టినట్లు టిడిపి నాయకులు సోషల్ మీడియాలో ఎమ్మెల్యేను అవమానపరుస్తూ, కించపరుస్తూ పోస్టులు పెట్టారని,వైసీపీ నాయకులు ఫోన్ లో ప్రశ్నించారు. దింతో యర్రగొండపాలెం పోలీస్ స్టేషన్ లో టిడిపి సోషల్ మీడియా నాయకుడు షేక్ అజారుద్దీన్ వైసీపీ జిల్లా ఐటి వింగ్ అధ్యక్షుడు నాగేశ్వర రెడ్డి,నియోజకవర్గ సోషల్ మీడియా మాజీ అధ్యక్షుడు ఒద్దుల లక్ష్మీ రెడ్డి,చిట్టె వెంకటేశ్వర రెడ్డిపై పిర్యాదు చేసారు.అదే రోజు తమ ఎమ్మెల్యేను అవమానపరిచారని యర్రగొండపాలెం వైసీపీ మండల కన్వీనర్ ముసలారెడ్డి పుల్లలచెరువు,త్రిపురాంతకం మండలాల టిడిపి కన్వీనర్లు పోట్ల గోవిందు,మేకల వలరాజు,టిడిపి సోషల్ మీడియా నాయకుడు అజారుద్దీన్ పై ఫిర్యాదు చేశారు.అయితే ముగ్గురు వైసీపీ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేసి నోటీసులు ఇచ్చారు.ఈ విషయంపై ఎమ్మెల్యే తాటిపర్తి స్టేషన్ కు వెళ్లి వైసీపీ నాయకులపై అక్రమ కేసులు నమోదు చేసి టిడిపి నాయకులపై ఎందుకు కేసులు నమోదు చేయలేదని ఎస్సై దేవ కుమార్ ను ప్రశ్నించారు.అధికార పార్టీ అండదండలతో తమ పార్టీ నాయకులపై పోలీసులు తప్పుడు కేసులు బనాయించడం,ఏకపక్షంగా వ్యవహరించటం సరికాదని హితవు పలికారు.గతంలో తాను మంత్రి లోకేష్ పై ట్విట్టర్ లో పోస్టు పెడితే కేసు నమోదు చేసిన పోలీసులు ఒక ఎమ్మెల్యేపై పోస్టులు పెడితే నాయకులపై ఎందుకు కేసులు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు.తనపై సోషల్ మీడియాలో అసత్యాలను ప్రచారం చేసిన ఆధారాలను చూపిస్తూ టిడిపి నాయకులపై కూడా కేసులు నమోదు చేయాలని పోలీసులతో వాగ్వాదానికి దిగారు.అనంతరం స్టేషన్ బయట ఎమ్మెల్యే తాటిపర్తి మీడియాతో మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధమైన ఎమ్మెల్యే పదవిలో ఉన్న తనపై ప్రజాస్వామ్య విలువలను మరచి విశాక్షణ లేకుండా టీడీపీ నేతలు మాట్లాడటం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అన్నారు.నియోజకవర్గంలో ఇక్కడ టిడిపి ఇంచార్జ్ చేస్తున్న అవినీతి,అక్రమాలకు అడ్డుపడుతున్నాననే ఆ పార్టీలో కొందరు చెంచా నాయకులతో తనపై అర్థం లేని విమర్శలను సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిస్తున్నారని ఆరోపించారు.రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుని కక్ష సాధింపు చర్యల భాగంగా తప్పుడు కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.అక్రమ కేసులకు గురైన తమ పార్టీ నాయకులకు న్యాయం జరగాలని,అక్రమ కేసులను వెంటనే వెత్తివేయాలని పోలీసులను కోరారు.ప్రజల హక్కులను రక్షించడం కోసం వైస్సార్సీపీ ఎప్పుడూ ముందుంటుందని,ఎర్రి బుక్ రాజ్యాగం పాలనలో పెడుతున్న ఇలాంటి అన్యాయాలకు,అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.ఇలాంటి సంఘటనలు మరల జరిగితే అవసరమైతే రోడ్లపైకి వచ్చి ఉద్యమాలు చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మూర్తిరెడ్డి,వైసీపీ మండల కన్వీనర్లు ముసలారెడ్డి,దోమకాల వెంకటేశ్వర్లు,వెంకట రమణారెడ్డి, కృష్ణారెడ్డి, జిల్లా ఐటి వింగ్ అధ్యక్షుడు నాగేశ్వర రెడ్డి,నాయకులు ఆళ్ల ఆంజనేయరెడ్డి, ఓబుల్ రెడ్డి,రాములు నాయక్,వైసీపీ వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పిల్లల భద్రతే లక్ష్యం...

## మైనర్ డ్రైవింగ్‌ను కట్టడి చేయాలి: జిల్లా ఎస్పీ




**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఏప్రిల్ 19**

వేసవి సెలవుల నేపథ్యంలో ప్రకాశం, మార్కాపురం జిల్లాల ప్రజలు సురక్షితమైన ప్రయాణాలు సాగించాలని, ముఖ్యంగా వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు కోరారు. ఈ మేరకు వాహనదారులు, తల్లిదండ్రుల కోసం ప్రత్యేక సూచనలు తెలియచేశారు. వేసవి సెలవుల్లో మైనర్లు (18 ఏళ్ల లోపు వారు) సరదా కోసం ద్విచక్ర వాహనాలు లేదా ఇతర వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉంటాయని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను పూర్తిగా అవగాహన లేకుండా వాహనాలు నడపడం ప్రాణాపాయానికి దారి తీస్తుందని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని, మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహన యజమానులు మరియు తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా భారీ జరిమానాలు, జైలు శిక్ష కూడా విధించే అవకాశం ఉందని స్పష్టం చేశారు. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారు ఎక్కడికి వెళ్తున్నారు, ఏమి చేస్తున్నారు అనే విషయాలపై పర్యవేక్షణ అవసరమని సూచించారు. హెల్మెట్ వినియోగం, ట్రాఫిక్ నియమాల పాటించడం వంటి విషయాల్లో చిన్నప్పటి నుంచే అవగాహన కల్పించాలని తెలిపారు. మీ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారికి వాహనాలు ఇవ్వకుండా కట్టడి చేయాలని, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ తెలియచేశారు. రద్దీ సమయాల్లో లేదా ట్రాఫిక్ జామ్‌ల సమయంలో వాహనదారులు సహనం కోల్పోయి రాంగ్ రూట్‌లో వెళ్లడం, అడ్డదిడ్డంగా వాహనాలు నడపడం చేయకూడదని సూచించారు. వరుస క్రమంలో వేచి ఉండి ట్రాఫిక్ క్లియర్ అయ్యే వరకు పోలీసులకు సహకరించాలని కోరారు. సుదూర ప్రయాణాలకు బయలుదేరే ముందు వాహనం టైర్లు, బ్రేకులు, ఇంజిన్ పరిస్థితిని తప్పనిసరిగా తనిఖీ చేసుకోవాలని తెలిపారు. జాతీయ రహదారులపై ప్రయాణించే సమయంలో రోడ్డు భద్రతా నియమాలను ఖచ్చితంగా పాటించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ హైవేలపై వాహనాలను నిలపరాదని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. అతివేగం, మైనర్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. పిల్లల భద్రతే లక్ష్యంగా మైనర్ డ్రైవింగ్‌ను కట్టడి చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

# మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా ఆపరేషన్ వజ్రప్రహార్





**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఏప్రిల్ 19**

మాదక ద్రవ్యాల నిర్మూలన, శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడిని లక్ష్యంగా చేసుకుని ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, ఆదేశాల మేరకు ఒంగోలు డి.ఎస్.పి రాయపాటి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఒంగోలు టూ టౌన్ సీఐ మేడా. శ్రీనివాసరావు, ఒంగోలు సబ్ డివిజన్ 8 మంది ఎస్సైలు , 42 మంది పోలీస్ సిబ్బంది ఒంగోలు టౌన్ లోని బాలాజీ నగర్, పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం'ఆపరేషన్ వజ్రా ప్రహార్'లో భాగంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. తనిఖీలలో భాగంగా గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిల్వ, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఇళ్లు, దుకాణాలు, పాత ముద్దాయిల నివాసాల్లో సోదాలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 12 బైక్ లు, 6 ఆటో లు స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రజలు గంజాయి సహా అన్ని రకాల మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాలకు బానిసైతే వ్యక్తి ఆర్థికంగా, కుటుంబపరంగా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వ్యక్తి తన చర్యలపై నియంత్రణ కోల్పోయి అనేక అనర్థాలకు గురయ్యే ప్రమాదం ఉందని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలు అక్రమ రవాణా, విక్రయదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అతివేగం, మైనర్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల కాల్స్‌కు స్పందించి ఓటీపీలు చెప్పవద్దని హెచ్చరించారు. అలాగే ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని, ఆధార్ వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు వస్తాయని చెప్పే మోసగాళ్లను నమ్మకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి, ప్రజలతో కలిసి మత్తుకు దూరంగా ఉండాలి -- మత్తు లేని సమాజాన్ని నిర్మిద్దాం అనే ప్రతిజ్ఞ చేయించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులు లేదా డయల్ 112 లేదా పోలీస్ వాట్స్అప్ నెంబర్ 9121102266 తెలియజేయాలని ప్రజలను కోరారు.

# స్వచ్ఛ రథం'తో పర్యావరణ మార్పు పరిసరాల పరిశుభ్రతే సమాజ లక్ష్యం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 19**

రాచర్ల గ్రామాలలో పరిసరాల పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో 'స్వచ్ఛ రథం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముత్తు ముల అశోక్ రెడ్డి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్వచ్ఛ రథం కేవలం చెత్త సేకరణ వాహనం మాత్రమే కాదని, ప్రజల ఆలోచనా విధానంలో మార్పు తీసుకువచ్చే ఒక సామాజిక ఉద్యమమని తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రజలకు చెత్త నిర్వహణపై అవగాహన కల్పించడం, ప్లాస్టిక్, ఇనుము, కాగితం వంటి వ్యర్థాలను పారవేయకుండా, వాటిని తిరిగి వినియోగించుకునే (రీసైక్లింగ్) అలవాటును పెంపొందించడం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. "వినియోగించని వస్తువులను ఇవ్వండి సరుకులు పొందండి" అనే నినాదంతో ప్రజలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేస్తూ, వ్యర్థాల బదులుగా నిత్యావసర సరుకులు అందించడం ద్వారా ప్రజల్లో ఉత్సాహాన్ని పెంచుతున్నామని పేర్కొన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నిల్వలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను సురక్షితంగా సేకరించడం, ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడాన్ని నిరోధించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయని తెలిపారు. దీంతో దోమల పెరుగుదల తగ్గి, సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా నివారించవచ్చని అన్నారు. రాచర్ల మండలం, గ్రామీణ ప్రాంతాలను పర్యాటక ప్రాంతాల మాదిరిగా స్వచ్ఛంగా, అందంగా తీర్చిదిద్దడం తమ కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం కేవలం సంక్షేమ పథకాలకే పరిమితం కాకుండా, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే వినూత్న కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. "ప్రతి ఇల్లు స్వచ్ఛంగా ఉంటేనే ఊరు స్వచ్ఛంగా ఉంటుంది. ఊరు స్వచ్ఛంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది" అని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ స్వచ్ఛ రథం సేవలను వినియోగించు కోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.



# పి.యం.గ్రామ సడక్ యోజన పథకం కొనసాగింపు - మాగుంట



**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఏప్రిల్ 19**

ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకాన్ని 2025 మార్చి తరువాత నుండి 2028 మార్చి వరకు కొనసాగించుటకు ప్రధానమంత్రి నరేంద్ర మోది అధ్యక్షతన డిల్లీలో జరిగిన సమావేశంలో కేంద్ర మంత్రివర్గం ఆమోదించినదని ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి తెలియజేశారు. గ్రామీణ మార్గాలగుండా ప్రధాన రహదారులకు అనుసంధానించబడే రోడ్డు మార్గాల పథకం ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన 2028 మార్చి వరకు సవరించిన రూ. 83,977 కోట్లు అంచనాతొ కేంద్రం పొడిగించినదని, గ్రామీణ నివాసాలు, వ్యవసాయ మార్కెట్లు, ఉన్నత పాఠశాలలు, వైద్యశాలలను కలుపుకొని రోడ్లు ఏర్పాటు చేయబడుటచే గ్రామీణ ప్రాంతాలు బాగా అభివృద్ధి చెందగలవని తెలిపారు. మైదాన, పర్వత ప్రాంతాలలో రోడ్లు, బ్రిడ్జీలు 2028 మార్చి లోపల మిగిలిపోయినవి పూర్తిచేయవచ్చని, పర్వత ప్రాంతాలలోని బ్రిడ్జీలు 2029 మార్చి లోపల పూర్తిచేయవచ్చని, 2025 మార్చి 31 నాటికి ముందు మంజూరైన పనులు, పెద్ద బ్రిడ్జీలు, రోడ్లు కూడా చేయవచ్చని తెలిపారు. రోడ్లు -- బ్రిడ్జీలు ఏర్పాటుతో గ్రామీణ ఆర్థిక, సామాజిక ప్రయోజనాలు, వాణిధ్యం, రవాణా సదుపాయం, వ్యవసాయ ఉత్పత్తుల విలువ -- మార్కెట్, ఉపాది అవకాశాలు పెరుగుదల రవాణ సమయం -- ఖర్చు తగ్గుదల తదితర ఎన్నో ఉపయోగాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు కలుగునని తెలియజేస్తూ, ఈ పథకాన్ని కొనసాగించినందుకు నరేంద్ర మోదీకి మాగుంట శ్రీనివాసులురెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఆటో ప్రమాదాలపై ఆటో వాలాలకు హెచ్చరికలు

## పోలీసుల హెచ్చరికలను అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు -కొమరోలు ఎస్సై నాగరాజు





**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 18**

ఆటోవాలాలు పోలీసుల హెచ్చరికలను ,రోడ్డు నిబంధనలను సక్రమంగా పాటించకపోవడం వల్లనే రోడ్డు ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయని, అందువల్ల ఆటోవాలాలు పోలీసులు హెచ్చరికలను, సూచనలను తప్పనిసరిగా పాటించాలని కొమరోలు ఎస్సై జక్కుల నాగరాజు ఆటోవాలాలను ఆదేశించారు. ఇటీవల ఒక ఆటో డ్రైవర్ సెల్ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల ఎడమ కళ్ళు క్రాస్ రోడ్ సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడిన సంఘటనలో మదవపల్లి గ్రామానికి చెందిన మూరం సుబ్బమ్మ అనే మహిళ మృతి చెందగా, మరి కొంతమంది ప్రయాణికులకు గాయాలయ్యాయి కాగా, శనివారం ఉదయం కొమరోలు నుంచి తాటిచర్ల మోటు వైపు కూలీలతో వెళుతున్న ఆటో ఎడమ కళ్ళు క్రాస్ రోడ్డు సమీపంలోని జగనన్న కాలనీ వద్ద రోడ్డుకు అడ్డంగా వచ్చిన అడవి పంది తప్పించబోయి బోల్తా పడింది. ఆ ప్రమాదంలో పదిమందికి గాయాలయ్యాయి. వరుసగా జరుగుతున్న ఆటో ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని శనివారం కొమరోలు ఎస్సై జక్కుల నాగరాజు కొమరోలు మండల పరిధిలోని దాదాపు 50 ఆటోవాలాలను, ఆటటోలతోపాటు పోలీసు స్టేషన్కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆ సందర్భంగా ఎస్సై నాగరాజు ఆటోవాలాలకు పలు సూచనలు సలహాలు హెచ్చరికలు ఇచ్చారు. ఆటో డ్రైవర్ క్యాబిన్లో డ్రైవర్ ఇరువైపులా ఉన్న సీట్లను తొలగించాలని, ఆటో క్యాబిన్లో కేవలం డ్రైవర్ మాత్రమే కూర్చోవాలని ఆయన ఆదేశించారు. ఆటోవాలాలు ప్రయాణంలో సెల్ఫోన్లో మాట్లాడడం చేయకూడదని, ధూమపానం చేయరాదని, ఆటోలో టేప్ రికార్డర్లు, డెక్కులు తొలగించాలని, ఎల్ఈడి లైట్లు ఏర్పాటు చేసుకోరాదని ఆయన హెచ్చరించారు .ఆటో డ్రైవర్ తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని, పరిమితమైన వేగంతో, పరిమితమైన ప్రయాణికుల సంఖ్యతో ఆటోలు నిర్వహించుకుంటూ, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని ఆయన ఆదేశించారు. మద్యం సేవించి ఆటో నడప కూడదని, ప్రయాణికుల పట్ల అసభ్యకరంగా, దురుసుగా ప్రవర్తించడం చేయరాదని, రోడ్లపై గల స్పీడ్ బ్రేకర్లను గుర్తిస్తూ అతి జాగ్రత్తగా ఆటోలను నడపాలని ఎస్సై నాగరాజు ఆటోవాలాలను హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు తమ డ్రైవింగ్ లైసెన్స్ లను ఆటోకు సంబంధించిన ధృవపత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని ఆయన ఆదేశించారు. రోడ్డు నిబంధనలను ,పోలీసుల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న ఆటోవాలాలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, ఆటోలను సీజ్ చేసి కోర్టుకు సమర్పిస్తామని ఆయనే తీవ్రంగా హెచ్చరించారు. ఆ కార్యక్రమంలో కొమరోలు మండల పరిధిలోని 50 మంది ఆటో డ్రైవర్లు పాల్గొని, తమ సెల్ ఫోన్ నెంబర్లను పేర్లను పోలీసులకు ఇచ్చారు.

# వడియ రాజుల ఆత్మీయ సమ్మేళన సమావేశం



**పెన్ పవర్, కంభం ఏప్రిల్ 19**

వడియ రాజుల ఆత్మీయ సమ్మేళన సమావేశం ఘనంగా నిర్వహించారు. కంభం కందులాపురం నకు చెందిన వడియ రాజుల కులస్తులు ఆత్మీయ సమావేశం నిర్వహించడం జరిగింది. అంకాలమ్మ గుడికి సమీపంలో ఏర్పాటు చేశారు. వడియ రాజులు వారి అభివృద్ధికి కృషి చేయాలని వారు కోరారు. సమావేశానికి ముందుగా వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఒకరికొకరు పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. వడియ రాజుల సంఘం ఆవశ్యకత మరియు సంఘ నిర్వహణకు విధి విధానాలు తయారు చేయడంలో పలువురి సూచనలు సలహాలను స్వీకరించడం జరిగినది. సంఘం తరఫున ప్రతి ఒక్కరూ సహకరించి ఈ కార్యక్రమాలను జయప్రదం చేసి కుల సంఘ ఐక్యతను చాటి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమమును వేముల రాజు టీ వి శేఖర్ సిహెచ్ కృష్ణమోహన్ తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు వేముల రమణయ్య సంఘ సభ్యులుతదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ద్వాదశ మహా కుంభాభిషేక మహోత్సవములు



**దొనకొండ ఏప్రిల్ 19 పెన్ పవర్**

మండల కేంద్రంలో స్థానిక విరాట్ నగర్ లో గల శ్రీ ఆనంద ఆశ్రమంలో ఘనంగా శ్రీ ఆనంద ఆశ్రమ ద్వాదశ మహా కుంభాభిషేక మహోత్సవం 20 4 2026 సోమవారం దొనకొండ శ్రీ ఆనందాశ్రమంలో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయము నిర్మించి 12 సంవత్సరాలు సందర్భంగా ఆలయ శిఖర కుంభాభిషేక మహోత్సవములు నూతనంగా శ్రీ గణపతి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అయ్యప్ప స్వామి శ్రీ కాలభైరవ స్వామి శ్రీ దక్షిణామూర్తి శ్రీ నాగేంద్ర స్వామి శ్రీ శనీశ్వర స్వాములవార్ల నూతన విగ్రహ ప్రతిష్ట శ్రీ అచలానంద ఆశ్రమ పీఠాధిపతుల సుహస్తాలచే జరుగుతుందని ఆశ్రమాధిపతులు శ్రీ భైరవానంద స్వామి తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఉదయం 5 గంటల నుండి యంత్ర ప్రతిష్టలు ప్రాణ ప్రతిష్ట కుంభాభిషేకం శాంతి కల్యాణము పూర్ణహుతి నిర్వహిస్తు మధ్యాహ్నం 12 గంటల నుండి రాత్రి 12 గంటల వరకు అన్నదాన కార్యక్రమం రాత్రి 7 గంటల నుండి బ్రహ్మంగారి నాటకం కోలాటం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు శ్రీ భైరవ స్వామి తెలియజేశారు

# ప్రభుత్వ పాఠశాలలే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పునాది

**ఎమ్మెల్యే ముత్తుముల**



**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 19**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలి" అనే నినాదంతో శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఉపాధ్యాయులతో కలిసి రాచర్ల లో వినూత్న ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ :?నాణ్యమైన విద్య: ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా నేడు ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్య అందుబాటులో ఉందిని. ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజన పథకం వంటి అనేక సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోంది అని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

## - రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు మధుసూదన్ రావు



**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఏప్రిల్ 19**

బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు మధుసూదన్ రావు పేర్కొన్నారు. అక్షయ తృతీయ సందర్భంగా ఆదివారం సింగరాయకొండ మండలంలోని బింగ బావి సెంటర్ నందు ఏర్పాటుచేసిన బాల్య వివాహరహిత ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మధుసూదన్ రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాల పట్ల అవగాహన కల్పించాలని అందుకోసం ఎక్కువ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పల్లె కారులు, ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలు ఉండే ప్రాంతాల్లో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతూ ఉంటాయి కాబట్టి అన్ని ప్రభుత్వ శాఖల వారు సమన్వయంతో కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతి స్కూల్లో చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్లు ఉండాలని వేసవి సెలవుల్లో కిషోర్ వికాసానికి సంబంధించిన కౌమార బాలికలకు ఎక్కువ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి బాల్య వివాహాలు జరగకుండా చూడాలని సూచించారు. గ్రామ, మండల స్థాయిలో ఉన్న బాల్య వివాహ నిరోధక కమిటీలు చురుగ్గా పనిచేయాలని, డివిజన్ లెవెల్లో మహిళ పోలీసులకు చట్టాల పట్ల ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేయాలని డిసిపిఓకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐసిడిఎస్ పి.డి ఎం నాగమణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి పి. దినేష్ కుమార్, సిడిపిఓ అంజమ్మ, మెడికల్ డిపార్ట్మెంట్ శిరీష, ఎస్సై అంజిరెడ్డి, ఎన్జీవో సునీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బదులు ఆదరించండి



**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 19**

జిల్లా పరిషత్ బాలికొన్నత పాఠశాల,గిద్దలూరు ఆధ్వర్యం లో "మన ఊరి ప్రభుత్వ బడికి పోదాం" అనే కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండల విద్యాశాఖాధికారి.పోలా నాగభూషణ్ రెడ్డి ప్రారంబించారు.ప్రభుత్వం 16నుండి ఈనెల 22 ప్రకటించిన విద్యా వారోత్స వాల లో భాగంగా ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు విద్యార్థినులు ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ బడులలో 6వ తరగతి నుండి 10 వ తరగతి వరకు పిల్ల లను చేర్పించాలని కోరారు.ప్రైవేటు పాఠశాల లకు ధీటు గా బోధన ,డిజిటల్ విద్య బోధన, అందుబాటులో ఉందని, ప్రభుత్వ పాఠశాల లో బాలికలకు ప్రత్యేక రక్షణ ఉందని, క్రీడా,, సాంకేతిక విద్య అందుబాటులో ఉందని ప్లకార్డు లతో ర్యాలీ చేపట్టారు.

# కార్మిక సమస్యల పరిష్కారమే యూనియన్ లక్ష్యం

## ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభల గోడ పత్రిక ఆవిష్కరణ




**మార్కాపురం టౌన్ పెన్ పవర్ ఏప్రిల్ 19**

ఈ నెల 26 నుండి 28 వరకు తిరుపతిలో జరగనున్న ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) రాష్ట్ర 18వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ యాసిన్ పిలుపునిచ్చారు. స్థానిక పూల సుబ్బయ్య శాంతి భవన్లో కె.వి. కృష్ణ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మహాసభల గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి యం.యల్. నారాయణ హాజరయ్యారు. సయ్యద్ యాసిన్ మాట్లాడుతూ మహాసభల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి స్థాయిలో కొనసాగుతున్నాయని తెలిపారు. జిల్లావ్యాప్తంగా విస్తృత ప్రచారం చేపట్టామని, కార్మికులు భారీగా పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఏప్రిల్ 26న మధ్యాహ్నం 3 గంటలకు తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ ఎదుట చింతలచేను మార్గం నుంచి భారీ ర్యాలీ ప్రారంభమై నగర ప్రధాన వీధుల గుండా సాగి సాయంత్రం 4 గంటలకు ఇందిరా మైదానంలో బహిరంగ సభగా మారుతుందని వివరించారు. ఈ ర్యాలీలో వేలాది మంది కార్మికులు, మహిళలు, యువకులు పాల్గొని తమ సమస్యలు, హక్కుల కోసం గళమెత్తనున్నారని పేర్కొన్నారు.మహాసభలకు ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, జాతీయ కార్యదర్శి అమరజిత్ కౌర్ ముఖ్య అతిథిగా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య లు పాల్గొని కార్మిక సమస్యలపై దిశానిర్దేశం చేయనున్నారని తెలిపారు. కార్మిక హక్కుల పరిరక్షణలో ఏఐటీయూసీ ఎప్పటికీ ముందుంటుందని తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి కార్మిక సంఘాలు భారీగా తరలి వచ్చి మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు అందె నాసరయ్య, ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.కె. ఖాసీం, ఉపాధ్యక్షులు యం. రాములు, వై. వెంకట రెడ్డి, వి. వెంకటేశ్వర్లు, వెంకట శివయ్య, సహాయ కార్యదర్శులు దాసరి మల్లిఖార్జున, కిరణ్, సరళాదేవి, జిల్లా ఖజాంచి పి. మస్తాన్ రావు, నాసర్ వలి, నాగయ్య, పుల్లమ్మ, దాసరి సునీత, సరళ తదితరులు పాల్గొన్నారు.

# హజ్ యాత్రికులకు అండగా కూటమి ప్రభుత్వం

**షేక్ బదే నాయబ్ రసూల్**



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 19**

హజ్ యాత్రికులకు ఆర్థికంగా అండగా నిలుస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమని మండల టీడీపీ సీనియర్ నాయకులు కోవిలంపాడు గ్రామం నకు చెందిన షేక్ నాయబ్ రసూల్ బడే (చంద్రపూర్) అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హజ్ యాత్రకు వెళ్లే ప్రతి యాత్రికుడికి ఒక్కొక్కరికి రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందించడం ద్వారా ప్రభుత్వం వారి భక్తి యాత్రకు ప్రోత్సాహం అందిస్తోందన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఈ పథకం కోసం రూ.6.40 కోట్లు మంజూరు చేయడం ప్రభుత్వ సంకల్పాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపారు.హజ్ యాత్ర ముస్లింలకు అత్యంత పవిత్రమైనదిగా భావించబడుతుందని, అలాంటి యాత్రను సాఫల్యంగా పూర్తి చేసుకునేందుకు ప్రభుత్వం సహకరించడం గొప్ప విషయమని ఆయన అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు.

# ప్రమాదాల నియంత్రణకు పోలీస్ శాఖ ముందడుగు



**పుల్లల చెరువు పెన్ పవర్ ఏప్రిల్ 19**

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు జిల్లా పోలీస్ శాఖ ముందడుగు వేసింది. ప్రమాదాలకు కారణమవుతున్న బ్లాక్స్పాట్లు, ప్రమాదకర మలుపుల వద్ద కుంభాకార దర్పణాలను ఏర్పాటు చేస్తూ వాహనదారుల భద్రతపై దృష్టి సారించింది.జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు మార్కాపురం సబ్డివిజన్ డీఎస్పీ యు. నాగరాజు పర్యవేక్షణలో యర్రగొండపాలెం సీఐ కె అజయ్ కుమార్, పుల్లలచెరువు ఎస్ఐ బి. సాంబశివరావు ప్రత్యేకంగా ప్రమాదకర ప్రదేశాలను గుర్తించారు. పుల్లలచెరువు మండలంలోని మలుపులు, జంక్షన్లు, వై-జంక్షన్లు, యూ-టర్న్లు, విజిబిలిటీ తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ దర్పణాలను అమర్చారు. ఈ కుంభాకార దర్పణాల ద్వారా ఎదురుగా వచ్చే వాహనాలు ముందుగానే కనిపించేలా ఏర్పాట్లు చేయడంతో ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే డ్రైవర్లకు హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు.ప్రమాదాల నివారణలో ప్రజల భాగస్వామ్యం కూడా కీలకమని పోలీసులు పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించడం, వేగాన్ని నియంత్రించడం, మలుపుల వద్ద జాగ్రత్తగా వాహనం నడపడం వంటి చర్యలు తీసుకుంటే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని సూచించారు.

# ఘనంగా రత్నం విద్యాసంస్థల వార్షికోత్సవ వేడుకలు

## విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యం -బెల్లంకొండ విద్యాసంస్థల చైర్మన్ విజయలక్ష్మి





**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 19**

మండల కేంద్రం సి.ఎస్. పురం లోని రహిమాన్ కళ్యాణ మండపము నందు ఆదివారం రత్నం జూనియర్ కాలేజీ, బెల్లంకొండ డిగ్రీ కాలేజీ, బి.కె విద్యామందిర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ అండ్ సెక్రెటరీ ముద్దుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు విద్యార్థుల కళాత్మక ప్రదర్శనలు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం, భారీ సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొనడంతో కార్యక్రమం పండుగ వాతావరణాన్ని తలపించింది. ఈ వేడుకలకు కరస్పాండెంట్ మద్దుల శ్రీనివాసులు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా బెల్లంకొండ విద్యాసంస్థలు చైర్మన్, బిజెపి రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి బెల్లంకొండ విజయలక్ష్మి పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య ద్వారానే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని, గ్రామీణ ప్రాంతాల్లో పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు విద్యను అందించేందుకు తమ సంస్థలు కట్టుబడి ఉన్నాయని ఉన్నత విద్యను పొందేలా చేయాలన్న లక్ష్యంతో బెల్లంకొండ విద్యాసంస్థలు రాష్ట్రవ్యాప్తంగా 18 విద్యా కేంద్రాలను స్థాపించామని తెలిపారు. ముఖ్యంగా సి.ఎస్.పురం వంటి కరువు ప్రభావిత వెనుకబడిన ప్రాంతంలో విద్యా సదుపాయాల కొరత తీవ్రంగా ఉందని, ముఖ్యంగా డిగ్రీ కళాశాలలు లేకపోవడం వల్ల అనేక మంది విద్యార్థులు మధ్యలోనే చదువులు మానేస్తున్న దుస్థితి తనను కలచివేసిందని,ఈ ప్రాంతంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని నిర్ణయించుకొని స్వంత నిధులతో భవనాలు నిర్మించి కళాశాలను ప్రారంభించాం. దూర ప్రాంతాలకు వెళ్లే ఆర్థిక స్తోమత లేని విద్యార్థులకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు తమ తండ్రి మద్దుల రత్నం ఈ ప్రాంతంలో పశువైద్యశాఖలో సేవలందించడం ద్వారా ప్రజలతో ఉన్న అనుబంధం తమకు ప్రేరణగా మారిందని, ఈ నేలతో ఉన్న బంధం వల్లే ఇక్కడ పిల్లలకు విద్యా అవకాశాలు కల్పించాలని సంకల్పించామని, నేను మా తమ్ముడు మద్దుల శ్రీను ఇక్కడే పుట్టి పెరిగామని నేను ఎనిమిదో తరగతి వరకు ఇక్కడే చదివానని అన్నారు బదిలీపై మా తండ్రి మద్దుల రత్నం వివిధ ప్రాంతాల్లోకి వెళ్ళిన మా కుటుంబం ఇక్కడే 30 సంవత్సరాలు నివాసం ఉన్నామని గుర్తు చేశారు మా సంస్థలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన కొనసాగిస్తూ ప్రతి విద్యార్థి అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని , విద్యార్థులను ఉన్నత విద్యకు చేరువ చేయడమే తమ ప్రధాన లక్ష్యం అని అన్నారు నాణ్యమైన విద్యను అందించేందుకు సిలబస్ కు అనుగుణంగా బోధన ప్రాక్టికల్స్ సెమినార్లు నిర్వహిస్తున్నామని, ఉద్యోగ అవకాశాలను దృష్టిలో పెట్టుకొని విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేలా దీన్ దయాల్ కేంద్ర ప్రభుత్వం పథకం ద్వారా ఉచిత శిక్షణలు అందిస్తున్నామని అన్నారు ఈ సందర్భంగా కరస్పాండెంట్ మద్దుల శ్రీనివాసులు మరియు బెల్లంకొండ సంస్థల ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడమే తమ లక్ష్యమని అన్నారు వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థులను నిత్యాలు పాటలతో ఆకట్టుకున్నారు విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల ప్రతిభను చూసి ఆనందం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యా విస్తరణకు బెల్లంకొండ విద్యాసంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు ఈ కార్యక్రమంలో శ్రీ వీరిశెట్టి కాలేజీ డైరెక్టర్ పొదిలి వేల్పుల కృష్ణంరాజు, బెల్లంకొండ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కాకర్ల నారాయణ, రత్నం జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటేష్, బి కె విద్యా మందిర్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు బి సూర్య, ఆదిత్య జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ యశ్వంత్ పాల్, శ్రీ ఆదిత్య డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ షేక్ షరీఫ్, బెల్లంకొండ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పొదిలి రవికుమార్, శ్రీ ఆదిత్య జూనియర్ కాలేజ్ డైరెక్టర్ నున్న మధు, వీరిశెట్టి జూనియర్ కాలేజీ ఇన్చార్జి ప్రిన్సిపల్ కొమ్మినేని వెంకటేష్, విద్యార్థులు తల్లిదండ్రులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# నారాయణస్వామి సన్నిధిలో సిఐ వినోద్ కుమార్





**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 19**

జిల్లాలో ప్రసిద్ధి చెందిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం ను ఆదివారం పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ దుర్గాశి వినోద్ కుమార్ సందర్శించారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి గిరిరాజు నరసింహబాబు సమక్షంలో ఆలయ అర్చకులు మంకాల శివప్రసాద్ శర్మ గోత్రనామాలతో మంత్రోచ్ఛారణల మధ్య పూజలు నిర్వహించి ఆశీర్వదించారు అనంతరం దేవస్థానం తరపున ఆలయ కార్యనిర్వహణాధికారి గిరిరాజు నరసింహ బాబు మరియు అర్చకులు స్వామి వారి శేష వస్త్రములతో సిఐ వినోద్ కుమార్‌ను సత్కరించి స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు.

# క్రిమినల్ చట్టాలపై అవగాహన



**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 19**

రాచర్ల మండలం ఎస్ఐ పి. కోటేశ్వరరావు పోలీస్ బృందం, ప్రజలకు నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన కల్పించడంలో ముందున్నారు .2024 జూలై 1 నుండి అమలులోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, మరియు భారతీయ సాక్ష్య అధినియం గురించి వారు క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. బ్రిటీష్ కాలం నాటి పాత చట్టాల స్థానంలో వచ్చిన కొత్త చట్టాల వల్ల సామాన్య ప్రజలకు కలిగే ప్రయోజనాలను ఎస్ఐ కోటేశ్వరరావు వివరిస్తున్నారు. మహిళలు, పిల్లల రక్షణ కొత్త చట్టాలలో మహిళల భద్రత కోసం ప్రవేశపెట్టిన ప్రత్యేక నిబంధనలు , శక్తి యాప్ వినియోగంపై మహిళలకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నారు.సాంకేతికత వినియోగం దర్యాప్తు ప్రక్రియలో ఫోరెన్సిక్ సాక్ష్యాల ప్రాముఖ్యత మరియు ఈ-ఎఫ్ఐఆర్ వంటి ఆధునిక పద్ధతుల గురించి ప్రజలకు తెలియజేస్తున్నారు. ప్రజా భాగస్వామ్యం "చట్టాలపై అవగాహన కలిగి ఉండండి.. బాధ్యతగా ఉండండి" అనే సందేశంతో గ్రామాల్లో సభలు నిర్వహిస్తూ, ప్రజలకు చట్టపరమైన సందేహాలను నివృత్తి చేస్తున్నారు. చట్టం ఎవరికీ చుట్టం కాదు.. కానీ చట్టంపై అవగాహన ప్రతి ఒక్కరికీ అవసరం" అనే నినాదంతో ఎస్ఐ పి. కోటేశ్వరరావు సాగిస్తున్నారు. రాచర్ల మండలాన్ని నేరరహిత మండలంగా తీర్చిదిద్దడం లక్ష్యమని ఎస్సై కోటేశ్వరరావు పేర్కొన్నారు.

# పోతంశెట్టి రాకేష్‌కు సత్కారం

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 19**

మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆరు నెలలుగా ప్రతి శనివారం అన్నప్రసాద వితరణ కార్యక్రమం భక్తులకు అందిస్తూ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పోతంశెట్టి వెంకటరంగయ్య - విజయమ్మ దంపతుల కుమారుడు రాకేష్‌ను దేవస్థాన కమిటీ సభ్యులు ఆదివారం హైదరాబాదులో సన్మానించి అభినందించారు.సన్మాన కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు మాట్లాడుతూ, భగవంతుని సేవలో భాగంగా చేపట్టిన ఈ అన్నదాన కార్యక్రమం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. "అన్నదానం మహాదానం" అనే భావనను ఆచరణలో చూపిస్తూ భక్తులకు సేవ చేయడం గొప్ప విషయమని కొనియాడారు. రాకేష్ కుటుంబంపై శ్రీ వెంకటేశ్వర స్వామి కృప ఎల్లప్పుడూ ఉండాలని కుటుంబ సభ్యులు సుఖ సంతోషాలతో ఉండాలని ఆంక్షించారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ భగవంతుని ఆశీస్సులతోనే ఈ కార్యక్రమాన్ని కొనసాగించానని భక్తులకు సేవ చేయడం తనకు ఆనందాన్ని ఇచ్చిందని అన్నారు సన్మాన కార్యక్రమంలో విశ్రాంత స్పెషల్ కలెక్టర్ పిడుగు బాబురావు, పిడుగు సత్యనారాయణ, లింగం జాలయ్య, పిడుగు నారాయణ, పిడుగు హరి నారాయణ, పిడుగు ఆదినారాయణ, మామిడేల రమేష్, పిడుగు బాల నారాయణ, పిడుగు నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యంగా

## చలివేంద్రం ఏర్పాటు -కొంగలవీటి శేషారెడ్డి





**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 19**

వేసవి కాలంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా యోగి తాత నారాయణస్వామి ఆశీస్సులతో పంచర్ షాపు యజమాని కొంగలవీటి శేషారెడ్డి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్ మరియు పలువురు ఉపాధ్యాయులు అన్నారు మండల కేంద్రంలోని సి ఎస్ పురం - పామూరు రోడ్డులో గల పంచర్ షాపు సమీపంలో ఆదివారం కొంగవీటి శేషారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఉపాధ్యాయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వేసవి కాలంలో వివిధ పనుల నిమిత్తం సి.ఎస్.పురం వచ్చే ప్రజలకు ఈ చలివేంద్రం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. ప్రతి సంవత్సరం చల్లటి పందిరి ఏర్పాటు చేసి, కుండలలో మంచినీరు అందించడం ద్వారా ప్రజలకు సేవ చేయడం గొప్ప విషయమని కొనియాడారు. యోగి తాత నారాయణస్వామి ఆశీస్సులతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు ఈ సందర్భంగా శేషారెడ్డి మాట్లాడుతూ వేసవి కాలంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రయాణికులు స్థానిక ప్రజలు వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు అలాంటి పరిస్థితుల్లో వారికి తాగునీరు అందించడం తన బాధ్యతగా భావించి ప్రతి సంవత్సరం చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు స్థానిక ప్రజలు, ప్రయాణికులు శేషారెడ్డి సేవలను ప్రశంసిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు మరింత మంది చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ పాములపాటి నరసయ్య, సోమిశెట్టి సుబ్రహ్మణ్యం , ఉపాధ్యాయులు జూపూడి చిన్ని, సుబ్బరాయుడు, తోట శ్రీనివాసులు, షేక్ అహ్మద్, ఎలికా శ్రీను, సీఆర్పీ సతీష్ మరియు స్థానికులు పాల్గొన్నారు.

# డీ జే ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు

## ఏర్పాటు - ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల





**కల్చరల్ రిపోర్టర్, ఒంగోలు ఏప్రిల్ 19**

ఎండ తీవ్రత దృష్ట్యా డిజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలో ఆరు ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ చలివేంద్రాల్లో మంచినీటి తోపాటు ఉచితంగా ప్రతిరోజు మజ్జిగను పంపిణీ చేయడం జరుగుతుందని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు అన్నారు. ఆదివారం డీ జే ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలోని రిమ్స్ హాస్పిటల్, జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద , కోర్టు సెంటర్, కర్నూలు రోడ్డు ఫ్లైఓవర్, ఆర్టీసీ బస్టాండ్ ప్రధాన ద్వారం, గుంటూరు రోడ్డులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ ఒంగోలు నగరంలో డిజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా క్రమాలు నిర్వహిస్తున్నట్లు అందులో భాగంగా ప్రతి ఏడాది ఎండాకాలంలో ఏర్పాటు చేస్తున్నట్లుగానే ఈ ఏడాది కూడా ఎండ తీవ్రత దృష్ట్యా చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరానికి విచ్చేసే ప్రజలకు, ప్రయాణికులకు పాదచారులకు, చిరు వ్యాపారులకు ఎండ తీవ్రత నుండి ఉపశమనం కలిగించేలా వారి దాహార్తిని తీర్చడం తోపాటు డీ హైడ్రేషన్ నుంచి కాపాడుకోవడానికి మజ్జిగను పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిజేఆర్ ట్రస్ట్ నిర్వాహకులు దామచర్ల నాగ సత్యలత, దామచర్ల అనీషా లక్ష్మి,దామచర్ల తనూజా లక్ష్మి, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# భూ వివాదాలపై స్పందించిన మార్కాపురం ఎమ్మార్వో

**మార్కాపురం రూరల్ పెన్ పవర్ ఏప్రిల్ 19**

మార్కాపురం భూ వివాదం పై తాహసిల్దార్ చిరంజీవి స్పందించారు. సంబంధిత భూమికి తమ కార్యాలయానికి ఎటువంటి దరఖాస్తులు రాలేదని స్పష్టం చేశారు. అర్జీలు చేశామన్న వాదనలు అసత్యమని ఖండించారు. అధికారిక అనుమతులు లేకుండా భూమిని చదును చేయటం చట్ట విరుద్ధమని హెచ్చరించారు. అధికారుల పేరును దుర్వినియోగం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం రికార్డులు పరిశీలిస్తున్నామని అవసరమైతే విచారణ చేపడతామని అన్నారు.



# అగ్ని ప్రమాదం.. అప్రమత్తతే కీలకం

## అగ్నిమాపక అధికారి రేగలగడ్డ రామకృష్ణ





**మార్కాపురం టౌన్ పెన్ పవర్ ఏప్రిల్ 19**

అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా స్థానిక జననీ శ్వాస హాస్పిటల్, ఆరోగ్య హాస్పిటల్, శ్రీ బాలాజీ హాస్పిటల్ లలో అగ్నిమాపక అవగాహన సదస్సులను నిర్వహించారు. సిబ్బందికి అగ్ని ప్రమాదముల గురించి వివరించి పాటించవలసిన ముందస్తు జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హాస్పిటల్స్ సిబ్బందికి ఫస్ట్ ఎయిడ్ ఫైర్ ఫైటింగ్ ట్రైనింగ్ కల్పించారు. ఇందులో హాస్పిటల్స్ సిబ్బందికి అగ్నిమాపక సాధనాలను ఏ విధంగా ఉపయోగించాలో వారికి డెమో ప్రోగ్రాం ద్వారా చేసి చూపించారు. అదేవిధంగా అనుకోకుండా హాస్పిటల్లలో ఏదైనా ప్రమాదం జరిగితే అగ్నిప్రమాదంలో చిక్కుకున్నటువంటి వారిని ఏ విధంగా సురక్షిత ప్రాంతానికి తీసుకురావాలో వారికి వివరించారు. ఎలక్ట్రికల్ ఫైర్ జరగకుండా వారు పాటించాల్సిన ఎలక్ట్రికల్ సేఫ్టీ గురించి హాస్పిటల్ యాజమాన్యనికి తెలియజేశారు. ఈ అవగాహన సదస్సులో పాల్గొన్న వారికి పాంప్లెట్స్ ను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం అగ్నిమాపక అధికారి రేగలగడ్డ రామకృష్ణ, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

# పొదిలిలో కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం నాయకులు



**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 19**

పొదిలి లో జరిగిన ఒక ప్రైవేట్ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు. ఆదివారం నాడు పట్టణంలోని సాయి కళ్యాణ మండపం లో తెలుగుదేశం మైనారిటీ నాయకులు ఎండి గౌస్ బంధువైన షేక్ జాకీర్ కుమార్తె, కుమారుడి పుట్టెంట్రుకల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి తండ్రి నారాయణరెడ్డి, దర్శి నియోజకవర్గ తెలుగుదేశం ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మి భర్త లలిత్ సాగర్, మండల దేశం నాయకులు కాటూరి వెంకటనారాయణ బాబు, ముల్లా కుద్దూస్, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, నాయకులు మేగడ ఓబుల్ రెడ్డి, షబ్బీర్, ముల్లా గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## పొదిలిలో కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం నాయకులు



**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 19**

పొదిలి లో జరిగిన ఒక ప్రైవేట్ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు. ఆదివారం నాడు పట్టణంలోని సాయి కళ్యాణ మండపం లో తెలుగుదేశం మైనారిటీ నాయకులు ఎండి గౌస్ బంధువైన షేక్ జాకీర్ కుమార్తె, కుమారుడి పుట్టెంట్రుకల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి తండ్రి నారాయణరెడ్డి, దర్శి నియోజకవర్గ తెలుగుదేశం ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మి భర్త లలిత్ సాగర్, మండల దేశం నాయకులు కాటూరి వెంకటనారాయణ బాబు, ముల్లా కుద్దూస్, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, నాయకులు మేగడ ఓబుల్ రెడ్డి, షబ్బీర్, ముల్లా గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## నారాయణస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 19**

జిల్లాలో ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రంగా పేరొందిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో స్వామివారికి ఆదివారం ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి గిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ పర్యవేక్షణలో అర్చకులు మంకాల శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారి మూల విరాట్ ను వివిధ రకాల పూలమాలలతో అలంకరించి పంచామృత అభిషేక పూజలు నిర్వహించారు స్వామివారి మూలవిరాట్, శ్రీదేవి భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో పూలమాలలతో అలంకరించారు అనంతరం గోపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. గోశాల వద్ద గోవును పవిత్రంగా అలంకరించి వేదమంత్రాలతో పూజలు చేసిన తదుపరి దేవస్థానం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు నిర్వహించి స్వామివారికి మహా నైవేద్యం సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు అనంతరం రాత్రి కి ఆలయ ఆవరణలో పల్లకి సేవ నిర్వహించారు ఈ కార్యక్రమాలలో కొమ్మినేని వెంకట్రావు, కొంగలవీటి శేషారెడ్డి , ఆలయ సిబ్బంది, ఆలయ అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గుడ్లూరు పీ.ఎస్ ను తనిఖీచేసిన డీఎస్పీ బాల సుబ్రహ్మణ్యం



**గుడ్లూరు, పెన్ పవర్, ఏప్రిల్ 19**

గుడ్లూరు పోలీస్ స్టేషన్ ను కందుకూరు డీ.ఎస్.పీ సీ.హెచ్.వీ.బాల సుబ్రమణ్యం ఆదివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సాధారణ తనిఖీలలో భాగంగా గుడ్లూరు పీ.ఎస్ ను తనికీ చేయడం జరిగినదని ఆయన అన్నారు. స్టేషన్ ను, స్టేషన్ పరిసర ప్రాంతాలను తనికీ చేసి, పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ బాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గుడ్లూరు పీ.ఎస్ పెర్ఫామెన్స్ తో పాటు కేసుల గురించి అన్నీ వివరాలు తెలుసుకొని కేసులు పెండింగ్ లేకుండా, సత్వరం న్యాయం జరిగేలా చూడాలని తెలియజేయడం జరిగినదన్నారు. గుడ్లూరు పీఎస్ పరిధిలో నేషనల్ హైవే ఉన్నందువలన ప్రమాదాలు తరుచూ జరుగుతున్నాయని, వాటి నివారణకు తీసుకొనవల్సిన చర్యల గురించి చర్చించడం జరిగినదన్నారు. ప్రమాద స్థలాలను గుర్తించి అక్కడ చేయవలసిన నియంత్రణ ఏర్పాట్లను వివరించడంతో పాటు బెట్టింగ్, పేకాట, కోడి పందేలు వంటి వాటి విషయంలో కఠినంగా వ్యవహరించాలని సూచించడం జరిగినదన్నారు. ఈ కార్యక్రమంలో సీ.ఐ నరేష్ కుమార్, ఎస్సై వి.వెంకట్రావు తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# శక్తి చిన్నపిల్లల హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహణ

## వైద్యపరీక్షలు నిర్వహించిన డాక్టర్ కె.వి అశోక్ చౌదరి -వేసవి దృష్ట్యా పిల్లల తల్లిదండ్రులకు పలు సూచనలు





**గుడ్లూరు, పెన్ పవర్, ఏప్రిల్ 19**

శక్తి చిన్నపిల్లల హాస్పిటల్, కందుకూరు వారి ఉచిత మెగా వైద్య శిబిరం మండల కేంద్రమైన గుడ్లూరు హైస్కూల్ నందు ఆదివారం నిర్వహించారు. చిన్న పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ కె.వి అశోక్ చౌదరి పాల్గొని, చిన్న పిల్లలను పరీక్షించి, ఉచితంగా మందులను కూడా అందచేశారు. అంతే కాకుండా ఈ ఎండాకాలంలో పిల్లలకు డీ హైడ్రేషన్ కారణంగా వచ్చే ఆటలమ్మ, చంపలమ్మ, దద్దు వంటి అంటు వ్యాధులకు పాటించవలసిన జాగ్రత్తలను పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా శక్తి చిన్న పిల్లల హాస్పిటల్ వైద్య నిపుణులు డాక్టర్. కె.వి అశోక్ చౌదరి మాట్లాడుతూ మా శక్తి చిన్నపిల్లల హాస్పిటల్(ప్రశాంతి థియేటర్ దగ్గర) ఆధ్వర్యంలో కందుకూరు నియోజకవర్గంలో ప్రతి మండల కేంద్రంలో ఉచిత మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, చిన్నపిల్లలకు సంబంధించిన అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేసి, మందులు ఉచితంగా పంపిణీ చేసి వైద్య సేవలు అందిస్తామన్నారు. అంతేకాకుండా మా కందుకూరు శక్తి చిన్నపిల్లల హాస్పిటల్ నందు చిన్నపిల్లలకు సంబంధించిన అన్ని రకాల వైద్య సేవలు 24/7 గంటలు అందుబాటులో ఉండి, చిన్న పిల్లలకు సంబంధించిన మెరుగైన వైద్య సేవలు అందించడమే మా శక్తి చిన్నపిల్లల హాస్పిటల్ వారి లక్ష్యమని, అంతే కాకుండా నవజాత శిశువులు అనగా నెలలు తక్కువ నిండిన, బరువు తక్కువగా ఉన్న పురిటి పిల్లల అత్యవసర చికిత్సలకు అత్యాధునిక (ఐసీయూ, వెంటిలేటర్) పరికరాలతో మన శక్తి హాస్పిటల్ లో మాత్రమే చికిత్స చేస్తున్నామని, గత ఏడాది కాలంలో మేము చికిత్స అందించిన 150 కి పైగా నవజాత పిల్లలకు చికిత్స అందించి, సురక్షితంగా తల్లి తండ్రులకి, అప్పగించిన ఘనత మా శక్తి హాస్పిటల్ ది అని తెలియజేశారు. కావున తల్లి తండ్రులు సుదూర ప్రాంతాల కు వెళ్ళి మీ డబ్బు, సమయం వృధా చేసుకోకుండా పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని మా హాస్పిటల్ సేవలను ఉపయోగించుకోవలసిందిగా కోరుకుంటున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని మాకు ఇచ్చిన హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రాం మోహన్ కు ధాన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు.

## పాడేరు జీజీహెచ్‌లో అగ్నిమాపక మాక్ డ్రిల్

**ప్రమాద సమయంలో లిఫ్ట్ వాడొద్దు, మెట్ల మార్గమే శరణ్యం: అగ్నిమాపక అధికారులు.**



**పాడేరు, పెన్ పవర్, ఎప్రిల్ 19:** జాతీయ అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా 6వ రోజు పాడేరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో డెమో మాక్ డ్రిల్ నిర్వహించారు.

ఏప్రిల్ 14 నుంచి 20 వరకు జరుగుతున్న ఫైర్ వారోత్సవాల్లో భాగంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బందికి, ప్రజలకు పాంప్లెట్స్, బ్రోచర్స్ పంపిణీ చేశారు. ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ ఎలా ఉపయోగించాలో అగ్నిమాపక సిబ్బంది డెమో చేసి చూపించారు.

ప్రమాదం జరిగినప్పుడు లిఫ్టును ఉపయోగించరాదని, మెట్ల మార్గం మీదనే బయటకు రావాలని సూచించారు. ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ అయినప్పుడు జూ2 లేదా ఙజూ ఎక్స్‌టింగ్విషర్‌ను ఉపయోగించాలని, నీరు వంటి లిక్విడ్ పదార్థాలు పోయరాదని, పొడి ఇసుక వాడాలని అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో డీడీఆర్ ఏ ఎఫ్.ఓ బి. లక్ష్మణస్వామి, ఎస్.ఎఫ్.ఓ జి. లక్ష్మణరావు, ఎల్.ఎఫ్ ఎల్. బాలకృష్ణ మరియు అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

## దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతా....



**రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్. పట్టాభిరామ్..**



**చీపురుపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 19 :** రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె. పట్టాభిరామ్ జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం చీపురుపల్లి, పట్టణాల్లో పర్యటించారు. చీపురుపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని దేశానికే రోల్ మోడల్ గా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా భవిష్యత్తులో రాష్ట్రానికి ఆదాయం వచ్చే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, బడ్జెట్ లో రెవెన్యూ ఆర్జించే శాఖగా స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ను అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను పూర్తిగా నిషేధించడం జరుగుతుందని దానికి ప్రత్యామ్నాయంగా ఉత్పత్తి చేస్తున్న వస్తువులకు కావలసిన ముడిసరుకు ప్రస్తుతం విదేశాల నుండి దిగుమతి చేయడం జరుగుతుందని, ఈ ప్రాంతంలో విస్తారంగా పండుతున్న మొక్కజొన్న పంట వ్యర్థాలతో ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ పదార్థాల తయారీ ముడిసరుకు యూనిట్ ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. తద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ఈ ప్రాంత రైతులకు అధిక ఆదాయం చేకూరుతుందన్నారు. 2047 డాక్యుమెంట్లో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని చేర్చడం జరిగిందని, ప్రజల ఆరోగ్యం బాగుంటేనే ఆ ప్రాంత అభివృద్ధి చెందుతుందని అన్నారు. గత ప్రభుత్వ సమయంలో పేరుకుపోయిన కోటి యాభై లక్షల మెట్రిక్ టన్నుల చెత్త తరలింపు జరుగుతుందని, భవిష్యత్తులో డంపింగ్ యార్డులలో చెత్త నిల్వ లేకుండా రాష్ట్రంలో పట్టణ ప్రాంతాల్లో 107 వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్లు , గ్రామీణ ప్రాంతంలో 210 ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లా లో 7 సెంటర్ లు, గరివిడి లో ఒకటి ప్రాసెసింగ్ యూనిట్లు చేస్తున్నట్లు తెలిపారు. డ్రైనేజీ సమస్యను పరిష్కరించుటకు తక్కువ ఖర్చుతో రూపొందిస్తున్న మ్యాజిక్ డ్రైన్ల నిర్మాణం చేయాలని అధికారులను స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ ఆదేశించారు. తొలుత చీపురుపల్లి పట్టణంలో మోడల్ మ్యాజిక్ డ్రైను నిర్మించి భవిష్యత్తులో నియోజవర్గం మొత్తానికి విస్తరించాలన్నారు. సంపద తయారీ కేంద్రాల ద్వారా రాష్ట్రం లో ఐదు లక్షల టన్నుల వర్మి కంపోస్ట్ ఉత్పత్తి చేయడం జరుగుతుందని, మార్క్ఫెడ్ ద్వారా రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా తక్కువ ధరకు రైతులకు వర్మి కంపోస్ట్ సరఫరా చేయుటకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్పొరేషన్ ద్వారా రాష్ట్రంలో 69.8 కోట్ల రూపాయలు ఖర్చు చేయగా విజయనగరం జిల్లాకు 10.55 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. స్వచ్ఛ రథం ద్వారా ప్లాస్టిక్ కొనుగోలు చేసి సరుకులు అందించడం జరుగుతుందని, భవిష్యత్తులో ప్రతి కిరాణా దుకాణంలో కూడా ఈ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. బహిరంగ మలవిసర్జన నిర్మూలన, పారిశుద్ధ్య కార్యక్రమ చర్యల్లో భాగంగా రాష్ట్ర, జిల్లా స్థాయిలో పబ్లిక్ మరియు కమ్యూనిటీ మరుగుదొడ్లు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి. డి. ఓ. కే .హేమ సుందర్ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు. ఆ పార్టీ నాయకులు. పైలా బలరాం రౌతు కామ నాయుడు రౌతు నారాయణరావు తాడే సన్యాసినాయుడు. సారీ పాక సురేష్. రమణమూర్తి. గర్భం ఏఎంసీ చైర్మన్. తాడే చంద్రశేఖర్. వైస్ చైర్మన్. దాసరి శివప్రసాదరావు. చీపురుపల్లి ఏఎంసీ చైర్మన్. రేగాన రామారావు. రౌతు నారాయణరావు. మహంతి అప్పలనాయుడు ,ఆర్. బ్ల్యూ.ఎస్. ఎస్ ఇ ఎస్. కవిత, డిఎల్ డి ఒ హేమసుందర్, ఎం పి డి ఒ ఐ. సురేష్, డి డబ్ల్యూ ఎస్ సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళల డిజిటల్ సాధికారతకు బాటలు గిద్దలూరులో డ్వాక్రా గ్రూప్ మహిళలకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ -ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి





**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 19**

మహిళలు ఆర్థికంగానే కాకుండా, సాంకేతికంగా ముందడుగు వేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గిద్దలూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, డ్వాక్రా గ్రూప్ మహిళలకు స్మార్ట్ ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేటి ఆధునిక కాలంలో ప్రతి ఒక్కరికీ సాంకేతిక పరిజ్ఞానం అవసరమని, ముఖ్యంగా మహిళా సంఘాల కార్యకలాపాలు మరింత పారదర్శకగా, వేగంగా సాగడానికి ఈ స్మార్ట్ ఫోన్లు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రభుత్వ పథకాలు, గ్రూపు నిర్వహణలో ఈ ఫోన్లు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, పొదుపు సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో డ్వాక్రా గ్రూప్ మహిళలకు పాల్గొన్నారు.

## 20,21 తేదీలలో హనుమంతరాయుని పల్లె గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిపివేత



**కొమరోలు, పెన్ పవర్, ఏప్రిల్ 19**

కొమరోలు మండలం కసినేపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని హనుమంతరాయినిపల్లె గ్రామానికి ఈనెల 20,21 తేదీలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లుగా కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ ఎం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఆర్డీఎస్ఎస్ పథకం ద్వారా అమలు జరుగుతున్న కొత్త లైన్ల ఏర్పాట్ల లో భాగంగా ఈనెల 20, 21 తేదీలలో హనుమంతరావు పల్లె గ్రామంలో కొత్త లైన్లు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. అందువల్ల ఆ గ్రామానికి రెండు రోజులపాటు ఉదయం 9:00 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లుగా ఆయన పేర్కొన్నారు. కావున ఆ గ్రామంలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు.

## దొంగతనాలు జరగకుండా జాగ్రత్తలు తప్పనిసరి

**అర్బన్ సిఐ సురేష్**



గిద్దలూరు దొంగతనాలు జరగకుండా ప్రజలు జాగ్రత్త వహించాలని గిద్దలూరు అర్బన్ కె సురేష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం పాత్రికేయులకు సీఐ సురేష్ ఓ ప్రకటన విడుదల చేశారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఆరుబయట నిద్రించేవారు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒంటిపైన విలువైన నగలు, వస్తువులు ధరించి బయట నిద్రించరాదన్నారు. మీ విలువైన వస్తువులను ఇంట్లో భద్రపరుచుకోవాలన్నారు. అలానే ఆలయాలలో చోరీలు జరగకుండా ఆలయ కమిటీ సభ్యులు జాగ్రత్తలు పాటిస్తూ ఆలయాలలో రోజు రాత్రి ఒకరు కాపలా గా నిద్రించేలా చూసుకోవాలన్నారు హుండీలలో ఉన్న నగదు ఎప్పటికప్పుడు హుండీ నుంచి తీసివేయాలని దేవతామూర్తులకు అలంకరించిన బంగారం, వెండి ఆభరణాలను లాకర్ లో భద్రపరచాలని సూచించారు. ముఖ్యంగా ఆలయ పరిసర ప్రాంతాలలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. మీ గ్రామా పరిసర ప్రాంతాలలో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సిఐ సురేష్ ప్రజలను కోరారు.

## పొదిలిలో ఆర్ఎంపి వైద్యుల అవగాహన సదస్సు

**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 19,**

పొదిలిలో ఆర్.ఎం.పి, పి.ఎం.పి వైద్యుల అవగాహన సదస్సు జరిగింది. ఆదివారం నాడు పట్టణంలోని ఒంగోలు రోడ్డులో గల లక్ష్మీ శ్రీనివాస హాస్పిటల్ లో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న పలువురు వివిధ విభాగాల నిపుణులైన డాక్టర్లు ఆర్.ఎం.పి పి.ఎం.పి వైద్యులకు పలు వైద్యపరమైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమానికి పొదిలి మార్కెట్ కమిటీ చైర్మన్, ఆర్.ఎం.పి, పీఎంపీ వైద్యుల సంఘం నాయకులు డాక్టర్ సయ్యద్ ఇమామ్ సార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యూరాలజిస్ట్ అబ్బూరి రవీంద్ర బాబు, కార్డియాలజీ వైద్యులు రాజశేఖర్ రెడ్డి, గైనకాలజిస్ట్ రాజ్యలక్ష్మి, పీడియాట్రిక్ వైద్యులు మనిధర్ రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మరో యుద్ధం తప్పదా..? కిమ్ జోంగ్ పంపుతున్న హెచ్చరికలు అర్థం అదేనా..?

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచం మొత్తం పశ్చిమాసియా యుద్ధంపై దృష్టి సారించిన వేళ, కిమ్ జోంగ్ ఉన్ మళ్లీ తన క్షిపణి ప్రయోగాలతో తూర్పు ఆసియాలో 'రెడ్ అలర్ట్' ప్రకటించేలా చేస్తున్నారు. ఆదివారం ఉదయం సిన్పో తీరం నుంచి జరిగిన ఈ ప్రయోగాలు కేవలం ఆయుధ పరీక్షలు మాత్రమే కాదు, అవి దక్షిణ కొరియా, జపాన్ దేశాల సహనాన్ని పరీక్షిస్తున్న హెచ్చరికలు.

**వరుస క్షిపణులతో కిమ్ జోంగ్ ఉన్ అలజడి..**

అంతర్జాతీయ సమాజం ఎన్ని ఆంక్షలు విధించినా, ఐక్యరాజ్యసమితి ఎన్ని తీర్మానాలు చేసినా ఉత్తర కొరియా తన పంథాను మార్చుకోవడం లేదు. తాజాగా ఆదివారం ఉదయం ఆ దేశం జరిపిన బాలిస్టిక్ క్షిపణి ప్రయోగాలు పొరుగు దేశాలైన దక్షిణ కొరియా, జపాన్‌లను గజగజ వణికిస్తున్నాయి. ఈ ఏడాదిలోనే ఇది నాలుగోసారి కావడం, అది కూడా నేరుగా సముద్ర తీరాల నుంచి ప్రయోగించడం కిమ్ జోంగ్ ఉన్ మొండివైఖరికి అద్దం పడుతోంది. ప్యాంగ్‌యాంగ్ చేస్తున్న ఈ కవ్వింపు చర్యలు తూర్పు ఆసియాలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని అనిశ్చితిని సృష్టించాయి.

**సిన్పో నుంచి సముద్రం వరకు..**

దక్షిణ కొరియా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ నివేదిక ప్రకారం.., ఉత్తర కొరియా తన తూర్పు తీరంలోని సిన్పో ప్రాంతం నుంచి ఈ క్షిపణులను ప్రయోగించింది. ఈ క్షిపణులు జపాన్ ఆర్థిక మండలికి సమీపంలో ఉన్న సముద్రంలో పడినట్లు గుర్తించారు. ఇవి స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణులైనా, వీటి వేగం, ఖచ్చితత్వం గతంలో కంటే మెరుగ్గా ఉన్నాయని జపాన్ రక్షణ మంత్రిత్వ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికాను, దాని మిత్రదేశాలను లక్ష్యంగా చేసుకోగల సామర్థ్యాన్ని తాము పెంచుకుంటున్నామని ఉత్తర కొరియా పరోక్షంగా సంకేతాలు ఇస్తోంది.

**అప్రమత్తమైన పొరుగు దేశాలు**

ఉత్తర కొరియా కదలికలతో దక్షిణ కొరియా అధ్యక్ష కార్యాలయం వెంటనే స్పందించింది. పరిస్థితిని సమీక్షించడానికి 'జాతీయ భద్రతా మండలి' అత్యవసరంగా భేటీ అయ్యింది. ఉత్తర కొరియా చేసే ఏ చిన్న సాహసానికైనా ధీటుగా సమాధానం ఇవ్వాలని నిర్ణయించింది. అమెరికా, జపాన్, దక్షిణ కొరియా దేశాలు తమ నిఘా వ్యవస్థలను అనుసంధానించాయి. ఉత్తర కొరియా అణు కేంద్రాల్లో కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నాయి.

**కిమ్ జోంగ్ ఉన్ అణు ఆకాంక్షలు**

గత వారం ఒక యుద్ధ నౌక నుంచి జరిగిన క్షిపణి ప్రయోగాన్ని స్వయంగా పర్యవేక్షించిన కిమ్, తన సైన్యానికి స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించారు. దేశం వద్ద ఉన్న అణ్వస్త్రాలను 'భారీగా విస్తరించడమే' తన ప్రధాన అజెండా అని ప్రకటించారు. శత్రువుల నుంచి ముప్పు పొంచి ఉన్నప్పుడు అణుదాడి సామర్థ్యమే తమకు రక్షణ అని ఆయన నమ్ముతున్నారు. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ డైరెక్టర్ జనరల్ రాఫెల్ గ్రోస్సీ మాటలు మరింత భయపెడుతున్నాయి. ఉత్తర కొరియాలోని అణు రియాక్టర్లలో కార్యకలాపాలు ముమ్మరంగా సాగుతున్నాయని, వారు ప్లుటోనియం నిల్వలను పెంచుకుంటున్నారని ఆయన ధృవీకరించారు.

**ఐక్యరాజ్యసమితి తీర్మానాలు బేఖాతరు**

బాలిస్టిక్ క్షిపణులను వాడకూడదని ఉత్తర కొరియాపై ఇప్పటికే అనేక ఆంక్షలు ఉన్నాయి. కానీ, ఆ దేశానికి మద్దతుగా నిలిచే రష్యా, చైనా వంటి దేశాల వల్ల ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో కొత్త ఆంక్షలు విధించడం కష్టమవుతోంది. ఇదే అదనుగా భావిస్తున్న కిమ్, తన క్షిపణి సాంకేతికతను శిఖరాగ్రానికి చేరుస్తున్నారు. తూర్పున ఉత్తర కొరియా, పశ్చిమాన ఇరాన్.. ఇలా రెండు వైపులా యుద్ధ వాతావరణం నెలకొనడం ప్రపంచ శాంతికి పెను సవాలు. దక్షిణ కొరియా కూడా తన రక్షణ బడ్జెట్‌ను పెంచి, అమెరికాతో కలిసి భారీ సైనిక విన్యాసాలు చేస్తోంది. ఈ పోటీ ఇలాగే కొనసాగితే, ఏదో ఒక చిన్న పొరపాటు కొరియా ద్వీపకల్పంలో మరో భీకర యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉంది. కిమ్ జోంగ్ ఉన్ క్షిపణి గర్జనలు కేవలం పొరుగు దేశాలనే కాదు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కూడా కుదిపేస్తున్నాయి.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఒకసారే నిజరూపం...మహిమ అద్భుతం

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలో ఎక్కడ ఆలయాల్లో అయినా స్వామి వారి అసలు రూపంతోనే దర్శనం భక్తులకు లభిస్తుంది. కానీ ఏకైక ఆలయంగా విశాఖలోని సింహాచలం శ్రీ వరాహ నరసింహ స్వామి వారి ఆలయంలో మాత్రమే ఏడాది మొత్తం స్వామి చందనంతో కప్పబడి ఉంటారు. ఒకే ఒక్క రోజున ఆయన నిజ రూపం కనిపిస్తుంది. అలా ఆ ఒక్క రోజునే స్వామిని దర్శించుకుని తరించే అవకాశం దక్కుతుంది. ఆ రోజు వైశాఖ శుద్ధ తృతీయ. దానినే అక్షర తృతీయగా కూడా చెబుతారు. అందుకే సింహాచలంలో చందనోత్సవం రోజు అంటే ఏపీ తెలంగాణా మాత్రమే కాదు ఒడిశా చతీష్ ఘడ్ వంటి చోట్ల నుంచి భక్తులు వేలల్లో తరలి వస్తారు. ఏడాదికి ఒకసారి కనిపించే నిజ రూప దర్శన భాగ్యాన్ని అందుకునేందుకు క్యూలు కడతారు. గంటల తరబడి వేచి ఉండి మరీ స్వామి రూపాన్ని చూసి జన్మ ధన్యం అయిందని ఆధ్యాత్మిక ఆనందాన్ని గుండె నిండా నింపుకుని వెనక్కి మరలుతారు.

**పుట్టలో వెలసిన స్వామి :**

ఇదిలా ఉంటే నిజ రూప దర్శనం వెనక ఆసక్తిని కలిగించే పురాగణ గాథ ఒకటి ఉంది. స్వామి వారి విగ్రహం పుట్టలో దొరికింది. దాని కోసం సాగిన అన్వేషణ కూడా ఎంతో ఉత్కంఠగా ఉంటుంది. యుగాల క్రితం చంద్రవంశానికి చెందిన పురూరవ చక్రవర్తి అలా ఆకాశమార్గాన పయనిస్తూ ఉంటే ఆయన విమానం సింహాచలం క్షేత్ర సమీపంలోకి వచ్చాక ముందుకు కదలక ఆగిపోతుంది. దాంతో పురూరవ చక్రవర్తి అక్కడే నేల మీదకు దిగుతాడు. ఆయనకు ఆ సమయంలో అక్కడ అడవిలో పూర్తిగా పుట్టతో కప్పబడిన స్వామి వారి విగ్రహం కనిపిస్తుంది. ఆయన పుట్టను సమీపంలోని గంగా జలంతో తొలగించి స్వామిని కనుగొంటాడు. అయితే ఉగ్ర రూపంలో ఉన్న ఆ నిజ మూర్తిని చూసిన పురూరవ చక్రవర్తి ఆశ్చర్యపోతాడు, భీతిల్లుతాడు. ఆ సమయంలో ఆకాశవాణి ఆయనకు చెబుతుంది. భక్తులు ఎవరూ నిజరూపం సాధారణ రోజులలో చూడలేరని అందువల్ల తిరిగి ఆ విగ్రహాన్ని కప్పి ఉంచి అక్కడే ప్రతిష్టించాలని. దాంతో చందనం పూసి ఆ విగ్రహాన్ని చక్రవర్తి అక్కడ కొలువు తీరుస్తాడు. సింహాచలం క్షేత్రాన్ని కూడా ఆయనే నిర్మిస్తాడు. అలా ఏడాదికి ఒకసారి స్వామి నిజరూప దర్శనం సంప్రదాయం కూడా ఆయనే ప్రారంభించారు. అదే తరువాత కాలంలో సింహాచలంగా ప్రసిద్ధి చెందింది. నాటి నుంచి స్వామి భక్తుల కోరిక మేరకు ఏడాదికి ఒకసారి నిజ రూపం దర్శనం ఇస్తాడు.

**నిజరూపం ఎలా ఉంటుందంటే :**

స్వామి ఏడాది పొడవునా చందనంతో కప్పబడి లింగాకారంలో భక్తులకు దర్శనం ఇస్తారు. కానీ నిజ రూపంలో ఎలా ఉంటారు అన్న ఆసక్తి అందరికీ ఉంటుంది. స్వామి వరాహ ముఖంతో నరుని శరీరంతో నిజ రూపంలో ఉంటారు. శ్వేత వర్ణంతో రెండు చేతులతో ఉంటారు. స్వామివారి భుజంపై తోక ఉంటుంది. అలాగే తలపై తెల్లని జూలు ఉంటుంది. ఇక నిజరూపంలో స్వామివారి పాదాలను దర్శించుకోవచ్చు. అక్షయ తృతీయ నాడు తెల్లవారుజాము నుంచి స్వామి వారి దర్శనాలు భక్తులకు లభిస్తాయి. ఇక నిజరూప దర్శనం అయిన వెంటనే స్వామివారికి మళ్లీ చందనం పూస్తారు. అయితే సింహాచలం వరాహ లక్ష్మీ నరసింహ స్వామి నిజరూప దర్శనం అనేది సింహాచల క్షేత్రంలో జరిగే అత్యంత పవిత్రమైన విశిష్టమైన ఆధ్యాత్మిక కార్యక్రమంగా ఉంటుంది.

**శ్రీకృష్ణదేవరాయల కాలంలో :**

సింహాచలం ఆలయాన్ని శ్రీకృష్ణదేవరాయలు కాలంలో ఎంతో అభివృద్ధి చేశారు. శ్రీకృష్ణదేవరాయలు స్వామి వారిని దర్శించుకుని మరీ ఎన్నో అభరణాలు ఆయనకు కానుకగా సమర్పించారు. అంతే కాదు రత్నాల హారాలను బహుమతిగా అందించి భక్తితో కొలిచారు. దాని కంటే ముందు ఈ ఆలయాన్ని 13వ శతాబ్దంలో తూర్పు గంగా రాజవంశానికి చెందిన నరసింహ దేవుడు ఈ అభివృద్ధి చేశారని చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఆధునిక కాలంలో ప్రభుత్వాలు కూడా ఈ ఆలయాన్ని ఎంతగానో అభివృద్ధి చేస్తూ వస్తున్నాయి. గతానికి పోలిస్తే స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎన్నో సదుపాయాలను కల్పిస్తున్నారు.

# అమెరికా వీసా కష్టాలు: 9 ఏళ్లలో 4 సార్లు తిరస్కరణ.. ఒక భారతీయ కుటుంబం ఆవేదన!

**హైదరాబాద్ పెన్ పవర్:** అగ్రరాజ్యం అమెరికా వెళ్లాలనేది చాలా మంది భారతీయుల కల. అయితే ఆ కల నెరవేరాలంటే పాస్‌పోర్ట్‌పై 'యూఎస్ వీసా' ముద్ర పడటం అంత తేలికైన విషయం కాదని మరోసారి రుజువైంది. తాజాగా ఒక భారతీయ కుటుంబానికి ఎదురైన చేదు అనుభవం ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా ముఖ్యంగా రెడిట్ లో పెద్ద చర్చకు దారి తీసింది. తొమ్మిదేళ్ల వ్యవధిలో ఏకంగా నాలుగు సార్లు ప్రయత్నించినా అమెరికా విజిటర్ వీసా (బీ1/బీ2) లభించకపోవడం విస్మయానికి గురి చేస్తోంది.

**దశాబ్ద కాలంగా సాగుతున్న వీసా పోరాటం**

సదరు కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం.. వారి వీసా ప్రయత్నాలు 2017లో ప్రారంభమయ్యాయి. అప్పట్లో ఒక కుటుంబ వివాహానికి హాజరుకావడానికి రెండుసార్లు దరఖాస్తు చేసుకోగా రెండుసార్లూ తిరస్కరణకు గురయ్యారు. అనంతరం 2018లో తమ కుమారుడి గ్రాడ్యుయేషన్ వేడుకకు వెళ్లాలని భావించి మూడోసారి దరఖాస్తు చేశారు. కొడుకు చదువు పూర్తి చేసుకుంటున్న ఆ మధుర క్షణాలను ప్రత్యక్షంగా చూడాలనుకున్న ఆ తల్లిదండ్రులకు అప్పుడు కూడా నిరాశే ఎదురైంది. వరుసగా మూడుసార్లు తిరస్కరణ ఎదురవడంతో ఆ కుటుంబం తమ ప్రొఫైల్‌ను మరింత పటిష్టం చేసుకోవాలని నిర్ణయించుకుంది. ఇందులో భాగంగా గత కొన్నేళ్లలో కెనడా, సింగపూర్, మలేషియా వంటి దేశాలను సందర్శించి బలమైన 'ట్రావెల్ హిస్టరీ'ని నిర్మించుకున్నారు. ఆర్థిక స్థిరత్వాన్ని నిరూపించే పత్రాలు స్వదేశంలో తమకున్న బలమైన బంధాలను చూపే ఆధారాలను సిద్ధం చేసుకుని, 2026లో నాలుగోసారి అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. కానీ విధి వెక్కిరించినట్లు ఈసారి కూడా వారికి వీసా లభించలేదు.

**సెక్షన్ 214(బీ): అతిపెద్ద అడ్డంకి**

ఈసారి కూడా వీసా తిరస్కరణకు కారణంగా సెక్షన్ 214(బీ)ని చూపించారు. అమెరికా వలస చట్టాల ప్రకారం వీసా కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి వ్యక్తి 'సంభావ్య వలసదారు' అని అధికారులు భావిస్తారు. దరఖాస్తుదారుడు తన పర్యటన ముగిసిన తర్వాత తిరిగి సొంత దేశానికి వస్తాడనే బలమైన సాక్ష్యాధారాలను చూపడంలో విఫలమైతే ఈ సెక్షన్ కింద వీసాను తిరస్కరిస్తారు.

అయితే ఆ కుటుంబం వాదన మరోలా ఉంది. తాజా ఇంటర్వ్యూ కేవలం రెండు నిమిషాల్లోనే ముగిసిపోయిందని, తమ ఆర్థిక స్థితిగతులు లేదా ఉద్యోగ బాధ్యతలను కనీసం పరిగణనలోకి కూడా తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తండ్రి ప్రభుత్వ ప్రాజెక్టులతో సంబంధం ఉన్న నిర్మాణ రంగ వ్యాపారిగా ఉండటం.. ఇంట్లో వృద్ధులను చూసుకోవాల్సిన బాధ్యత ఉండటం వంటి అంశాలేవీ అధికారులను మెప్పించలేకపోయాయి.

**బంధుత్వాలే శాపమా?**

ఈ ఉదంతంలో మరో ఆసక్తికరమైన కోణం ఏమిటంటే ఆ కుటుంబానికి అమెరికాలో ఉన్న బలమైన సంబంధాలు. వారి ఒక కుమారుడు 2016 నుంచి అక్కడే స్థిరపడి వివాహం చేసుకుని ఉంటున్నారు. అలాగే తండ్రి సోదరుడు కూడా గ్రీన్ కార్డ్ హోల్డర్. సాధారణంగా విదేశాల్లో బంధువులు ఉంటే వీసా సులభంగా వస్తుందని భావిస్తారు. కానీ ఇక్కడ అదే వారికి ప్రతిబంధకంగా మారిందని అనుమానిస్తున్నారు. అమెరికాలోనే బంధువులు ఉండటం వల్ల వీరు కూడా అక్కడికి వెళ్లి తిరిగి రారేమోనన్న సందేహం అధికారులకు కలిగి ఉండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

**నెటిజన్ల స్పందన.. ఆందోళన**

ఈ పోస్టుపై స్పందిస్తున్న నెటిజన్లు అమెరికా వీసా ప్రక్రియలోని అపారదర్శకతను తప్పుపడుతున్నారు. వేల రూపాయల ఫీజు చెల్లించి, నెలల తరబడి వెయిట్ చేసినా, కనీసం దరఖాస్తుదారుడి గోడు వినకుండానే సెకన్ల వ్యవధిలో నిర్ణయాలు తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. బలమైన ఆర్థిక నేపథ్యం, ట్రావెల్ హిస్టరీ ఉన్నప్పటికీ వీసా రాకపోవడం విచారకరమని అభిప్రాయపడుతున్నారు. మొత్తంమీద ఈ ఘటన అమెరికా విజిటర్ వీసా పొందడం అనేది కేవలం అర్హతపైనే కాకుండా ఆ సమయానికి ఉండే 'లక్' పైన కూడా ఆధారపడి ఉంటుందనే చర్చను మరోసారి తెరపైకి తెచ్చింది.

# స్టాలిన్ ని ఢీ కొడుతున్న బాబు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్డీయేలో అత్యంత కీలకమైన భాగస్వామిగా ఉన్నారు అన్నది తెలిసిందే. ఎన్డీయేలో బీజేపీ 240 సీట్లతో తొలి స్థానంలో ఉంటే 16 మంది ఎంపీలతో టీడీపీ రెండో పెద్ద పార్టీగా ఉంది. దానికి తగినట్లే ఎన్డీయేలో టీడీపీకి బాబుకు విశేష ప్రాధాన్యత రాజకీయంగా లభిస్తోంది. ఇదిలా ఉంటే దేశంలో ప్రస్తుతం జరుగుతున్న అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో ఎన్డీయే విజయం కోసం మిత్ర పార్టీలు అన్నీ మద్దతుగా నిలిచి ప్రచారంలోకి దిగిపోయాయి. ఇక ఏపీకి పక్కనే ఉన్న తమిళనాడు విషయంలో ఏపీ సీఎం చంద్రబాబు కూడా ఎన్ డీయే అభ్యర్థుల తరఫున ప్రచారానికి సిద్ధపడుతున్నారు.



**తమిళ సీమలో ప్రచారం :**

తమిళనాడు అంటే ఒకనాడు ఏపీతో కలసి ఉన్న రాష్ట్రమే. అంతే కాదు తెలుగు మాట్లాడే ప్రాంతాలు కూడా ఇక్కడ అధికంగా ఉన్నాయి. దాంతో బాబు ఎన్డీయే కూటమి తరఫున ప్రచారానికి రంగంలోకి దిగిపోతున్నారు. ఈ మేరకు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు రోజుల పాటు తమిళనాడులో పర్యటించనున్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో తమిళనాడులోని కోయంబత్తూరు, హోసూరు, తళ్లి, ఆవడి, మధురైలలో ఎన్డీఏ పక్షాల అభ్యర్థుల తరఫున బాబు ప్రచారం నిర్వహించనున్నారని తెలుస్తోంది.

**కోయంబత్తూరు నుంచే :**

ఇక ఈ నెల 20న ఉదయం అమరావతి నుంచి కోయంబత్తూరు బయల్దేరి వెళ్లనున్న చంద్రబాబు మధ్యాహ్నం ఒంటి గంటకు కోయంబత్తూరులో నిర్వహించే ఎన్నికల ప్రచార సభలో పాల్గొంటారు. ఆ విధంగా తొలి సభతో బాబు ఎన్నికల ప్రచారం మొదలై రెండు రోజుల పాటు ఉధృతంగా సాగుతుంది అని అంటున్నారు. కోయంబత్తూరు నుంచి హోసూరు నుంచి తళ్లి చేరుకుని బాబు అదే రోజు సాయంత్రం అక్కడ జరిగే ప్రచార ర్యాలీకి హాజరవుతారు. ఇక 20వ తేదీ రాత్రికి చెన్నై చేరుకుని ఆవడిలో జరగనున్న రోడ్ షోలో పాల్గొని ఎన్డీఏ అభ్యర్థుల తరఫున ప్రచారం చేయనున్నారని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఇక చెన్నైలోనే బాబు రాత్రికి బస చేస్తారు. ఆ మరుసటి రోజు అంటే 21వ తేదీ ఉదయం చెన్నై నుంచి బయలుదేరి మధురైకి బాబు చేరుకుంటారు. మధురై సమీపంలోని సాత్తూర్ లో మధ్యాహ్నం ఒంటి గంటకు వివిధ సామాజిక వర్గాల నేతలతో సమావేశం ఆయన నిర్వహించనున్నారు. అనంతరం మూడు గంటలకు సాత్తూర్ లోనే ఎన్డీఏ అభ్యర్థి తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. అదే రోజు సాయంత్రం మధురై నుంచి నేరుగా హైదరాబాద్ కు చేరుకుంటారు.

**పాత మిత్రునితో ఢీ :**

ఇదిలా ఉంటే స్టాలిన్ చంద్రబాబు పాత మిత్రులు. కరుణా నిధి కాలం నుంచి డీఎంకే టీడీపీల మధ్య మంచి స్నేహం ఉంది. ఎన్నో సార్లు కలసి పనిచేశారు. జాతీయ స్థాయిలో ఈ రెండు పార్టీలు భుజం కలిపి ప్రభుత్వాల ఏర్పాటులో కీలక పాత్ర పోషించాయి. అయితే బాబు ఇపుడు ఎన్డీయేలో ఉన్నారు. దాంతో స్టాలిన్ ప్రత్యర్థిగానే భావించి ఎన్నికల ప్రచారంలోకి దిగుతున్నారు. తమిళనాడులో త్రిముఖ పోరు సాగుతోంది. ఎన్డీయేలో అన్నా డీఎంకే బీజేపీ ఇతర పార్టీలు ఉన్నాయి. ఒక విధంగా బీజేపీ తమిళనాడుని ప్రతిష్టగా భావిస్తోంది. దాంతో బాబుతో ప్రచారం చేయిస్తోంది అని అంటున్నారు తమిళనాడులో కూడా బాబుకు ఆదరణ ఉంది కాబట్టి అది ఓట్ల రూపంలో మారుతుందని బీజేపీ పెద్దలు విశ్వసిస్తున్నారు. ఇక తమిళనాడులో బాబు ఏమి మాట్లాడుతారు, స్టాలిన్ మీద ఏ రకమైన విమర్శలు చేస్తారు అన్నది చూడాల్సి ఉంది.

# మాజీ మంత్రి అంబటి ఒకరోజు దీక్ష.. టీడీపీ వ్యంగ్యస్త్రాలు!




**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు 12 గంటల నిరాహారదీక్ష ముగిసింది. శనివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆయన గుంటూరు కలెక్టరేట్ ఎదుట నిరాహారదీక్ష చేశారు. తనను కస్టడీలో హింసించిన పోలీసులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన ఈ నిరసన దీక్ష చేపట్టారు. అయితే ఈ దీక్ష విఫలమైందని, కనీసం వంద మంది కూడా అంబటికి సంఘీభావం తెలిపేందుకు రాలేదంటూ టీడీపీ విమర్శలు గుప్పిస్తోంది. గుంటూరు వేదికగా మాజీ మంత్రి అంబటి రాంబాబు నిర్వహించిన నిరసన దీక్ష రాజకీయంగా హాట్ టాపిక్ గా మారింది. జనవరి 31న తన ఇంటిపై పోలీసుల సమక్షంలోనే టీడీపీ కార్యకర్తలు దాడి చేశారని, తనను అరెస్టు చేసి 18 రోజులు జైలులో పెట్టిన పోలీసులు, తన ఇంటిపై దాడి చేసిన కార్యకర్తలను కనీసం 18 నిమిషాలు కూడా పోలీసు స్టేషన్ లో పెట్టలేదని అంబటి రాంబాబు నిరసన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా తనను అరెస్టు చేసిన నల్లపాడు పోలీసులు కస్టడీలో హింసించారని ఆరోపించారు.పోలీసులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అంబటి డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ ప్రోద్బలంతోనే టీడీపీ కార్యకర్తలు తన ఇంటిపై దాడి చేశారని అంబటి ఆరోపించారు. పోలీసులు తమ వాహనాలకు టీడీపీ జెండాలు కట్టుకుని తిరగాలని ధ్వజమెత్తారు. దాడిని ప్రోత్సహించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని,

తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవరినీ వదిలిపెట్టమని మాజీ మంత్రి అంబటి హెచ్చరించారు.

అయితే అంబటి దీక్షకు వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఇంచార్జి నూరీ ఫాతిమా సంఘీభావం తెలిపారు. పలువురు కార్యకర్తలు సైతం అంబటి దీక్షా శిబిరాన్ని సందర్శించారు. అయితే అధికార పక్షం మాత్రం అంబటి దీక్షను ఎద్దేవా చేస్తూ విమర్శలు గుప్పిస్తోంది. ఈ దీక్షతో అంబటికి ప్రజల్లో ఎంత బలం ఉందో స్పష్టమైందని టీడీపీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. కనీసం వంద మంది అయినా దీక్షా శిబిరాన్ని సందర్శించలేదని, పట్టుమని పది మంది కూడా శిబిరం లేరంటూ ఎద్దేవా చేస్తున్నారు. దీంతో అంబటి దీక్షపై ఇరుపార్టీల మధ్య డైలాగ్ వార్ నడుస్తోంది.

## రాజస్థాన్‌పై రింకు సింగ్, అనుకూల్ కిరాక్ బ్యాటింగ్..
# ఐపీఎల్‌లో కేకేఆర్‌కు తొలి విజయం




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ (ఖఖ=) ఎట్టకేలకు బోణీ కొట్టింది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన హై-వోల్టేజ్ మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ అద్భుత విజయాన్ని అందుకుంది. ఓటమి కోరల్లో ఉన్న జట్టును రింకూ సింగ్ తన ఫినిషింగ్ టచ్‌తో గట్టెక్కించి, స్టేడియాన్ని హోరెత్తించాడు. 156 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన కోల్‌కతాకు ఆరంభంలోనే రాజస్థాన్ బౌలర్లు చుక్కలు చూపించారు. ఓపెనర్లు టిమ్ సీఫెర్ట్, అజింక్య రహానే ఇద్దరూ ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరడంతో కేకేఆర్ 5 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. రాజస్థాన్ స్పిన్నర్ రవీంద్ర జడేజా తన స్పిన్ మాయాజాలంతో రోవ్‌మన్ పావెల్ (23), అంగక్రిష్ రఘువంశీలను అవుట్ చేసి కేకేఆర్ ఆశలపై నీళ్లు చల్లాడు. కామెరాన్ గ్రీన్ (27) కాసేపు పోరాడినా రవి బిష్ణోయ్ అతడిని అడ్డుకున్నాడు.

**రింకూ సింగ్ 'మెరుపు' ఇన్నింగ్స్:** ఒకానొక దశలో కేకేఆర్ ఓటమి ఖాయమనిపించింది. కానీ, క్రీజులోకి వచ్చిన రింకూ సింగ్, అనుకూల్ రాయ్ బాధ్యతాయుతంగా ఆడారు. మొదట సింగిల్స్‌తో స్కోర్ బోర్డును నడిపించిన ఈ జోడీ, చివరి ఓవర్లలో ఒక్కసారిగా గేర్ మార్చింది. చివరి ఓవర్లో కేకేఆర్ విజయానికి 11 పరుగులు అవసరమవగా.. రింకూ సింగ్ తన విశ్వరూపం చూపించాడు. వరుసగా రెండు ఫోర్లు, ఒక కళ్లు చెదిరే సిక్సర్ బాది మ్యాచ్‌ను ఫినిష్ చేశాడు. ఈ క్రమంలోనే రింకూ సింగ్ తన కెరీర్‌లో మరో అద్భుతమైన అర్ధ సెంచరీని పూర్తి చేసుకున్నాడు.

**రాజస్థాన్ బౌలింగ్:**
రాజస్థాన్ బౌలర్లలో రవీంద్ర జడేజా 2 వికెట్లతో ఆకట్టుకోగా, జోఫ్రా ఆర్చర్, నాంద్రే బర్గర్, రవి బిష్ణోయ్, యశ్ రాజ్ పుంజా తలో వికెట్ పడగొట్టారు. అయితే

చివరి నిమిషంలో రింకూ సింగ్‌ను అడ్డుకోవడంలో రాజస్థాన్ బౌలర్లు ఘోరంగా విఫలమయ్యారు. మొదట్లో అద్భుతమైన బౌలింగ్ తో కేకేఆర్ అడ్డుకున్నప్పటికీ, చివర్లో మాత్రం ఫెయిల్ కావడంతో.. ఐపీఎల్ లో కోల్‌కతా నైట్‌రైడర్స్ మొదటి విజయాన్ని నమోదు చేసుకుంది.

# టాస్ గెలిచి బౌలింగ్ తీసుకున్న లక్నో.. పంజాబ్ ఫస్ట్ బ్యాటింగ్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో భాగంగా ముల్లాన్‌పూర్‌లోని మహారాజా యాదవీంద్ర సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో పంజాబ్ కింగ్స్ వర్సెస్ లక్నో సూపర్ జెయింట్స్ మధ్య జరుగుతున్న పోరులో టాస్ గెలిచిన లక్నో కెప్టెన్ రిషబ్ పంత్ ముందుగా బౌలింగ్ చేయాలని నిర్ణయించుకున్నాడు. దీంతో పంజాబ్ జట్టు మొదట బ్యాటింగ్ చేసేందుకు క్రీజులోకి రానుంది. ఈ మ్యాచులో భారీ టార్గెట్ పెట్టి లక్నోపై ఒత్తిడి పెట్టాలని లక్ష్యంతో పంజాబ్ బరిలోకి దిగుతుంది. లక్నో సూపర్ జెయంట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ మాట్లాడుతూ.. మేము ముందుగా బౌలింగ్ చేయాలనుకుంటున్నాం.. ఇక్కడ ప్రత్యర్థి జట్టు నిర్దేశించే లక్ష్యాన్ని ఛేదించడం మాకు ఇష్టం.. పంజాబ్ ఈ టోర్నీలో అత్యుత్తమ జట్లలో ఒకటిగా ఉంది, కానీ ఇది మాకు స్వేచ్ఛగా ఆడే అవకాశాన్ని ఇస్తుంది.. జట్టులో ఒక మార్పు చేశాం.. దిగ్వేశ్ రాఠీ స్థానంలో సిద్ధార్థ్ జట్టులోకి వచ్చాడని పంత్ వెల్లడించారు. పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మాట్లాడుతూ.. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు మేము ముందుగా బ్యాటింగ్ చేయలేదు, కాబట్టి ఇది మాకు ఒక మంచి సవాలు.. జట్టు మెరుగుపడుతున్నప్పుడు అది 'మాలో మాకే' పోటీ అని నేను భావిస్తాను.. అజేయంగా కొనసాగాలనే పట్టుదలతో ఉన్నాం.. మేము పాత జట్టుతోనే బరిలోకి దిగుతున్నామని అయ్యర్ పేర్కొన్నారు. లక్నో సూపర్ జెయింట్స్: మిచెల్ మార్ష్, ఆయుష్ బడోని, రిషబ్ పంత్ (కెప్టెన్/ వికెట్ కీపర్), ఐడెన్ మార్క్రామ్, నికోలస్ పూరన్, ముకుల్ చౌదరి, మహమ్మద్ షమీ, అవేష్ ఖాన్, ప్రిన్స్ యాదవ్, మణిమారన్ సిద్ధార్థ్, మొహ్సిన్ ఖాన్

పంజాబ్ కింగ్స్: ప్రియాంష్ ఆర్య, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్), కూపర్ కొన్నోలీ, శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), శశాంక్ సింగ్, నెహాల్ వధేరా, మార్కస్ స్టోయినిస్, మార్కో జాన్సెన్, జేవియర్ బార్ట్‌లెట్, అర్ష్‌దీప్ సింగ్, యుజ్వేంద్ర చాహల్

# సూర్యకుమార్ యాదవ్‌పై వేటు.. టీమిండియా టీ20 కెప్టెన్‌గా శ్రేయస్!





**హైదరాబాద్ పెన్ పవర్:** భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ పై వేటు పడే అవకాశంఉందా? అంటే అవుననే సమాధానం చెబుతున్నాయి బీసీసీఐ అధికారిక వర్గాలు. సారథిగా టీమిండియాకు అద్భుత విజయాలు అందించిన సూర్య.. బ్యాటర్ గా మాత్రం పేలవ ప్రదర్శనతో రోజు రోజుకు దిగజారిపోయాడు. దాదాపు ఏడాది పాటు టీ20ల్లో నంబర్--1 బ్యాటర్ కొనసాగిన స్కై.. ఇప్పుడు రెండెంకెల స్కోర్ చేయడానికి కూడా బాగా కష్టపడుతున్నాడు. కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టిన తర్వాత బ్యాటర్ గా ఘోరంగా విఫలమయ్యాడు. గతేడాది దాదాపు 25కు పైగా టీ20లు ఆడిన సూర్యకుమార్ కనీసం ఒక్క హాఫ్ సెంచరీ కూడా చేయలేడు. కెప్టెన్సీ భారం అతడి బ్యాటింగ్ పై పడుతున్నట్లు క్రికెట్ పండితులు పేర్కొన్నారు. ఈ క్రమంలో సూర్యను కెప్టెన్సీ నుంచి తప్పించాలని బోర్డు ఆలోచిస్తున్నట్లు తెలుస్తుంది. లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ 2028తో పాటు తదుపరి రెండు టీ20 ప్రపంచకప్ లని దృష్టిలో పెట్టుకుని బీసీసీఐ జట్టును రెడీ చేయాలని యోచిస్తున్నట్లు టాక్. దీంతో సూర్య స్థానంలో మరో ముంబై ప్లేయర్ శ్రేయస్ అయ్యరుకి జట్టు పగ్గాలు అప్పగించేందుకు ఇండియన్ క్రికెట్ బోర్డు ఇంట్రెస్ట్ చూపిస్తున్నట్లు వార్త కథనాలు వస్తున్నాయి. టీ20ల్లో నంబర్-- 4 స్థానానికి అయ్యర్ సరైన ప్రత్యామ్నాయమని బీసీసీఐ భావిస్తుంది. శ్రేయస్ అయ్యర్ ఇప్పటి వరకు జాతీయ జట్టుకు కెప్టెన్సీ వహించనప్పటికీ.. దేశవాళీ క్రికెట్ తో పాటు ఐపీఎల్లో కెప్టెన్ గా అతడికి మంచి ట్రాక్ రికార్డు ఉంది. శ్రేయస్ ప్రస్తుతం పంజాబ్ కింగ్స్ జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు. అంతకుముందు ఐపీఎల్-2024 సీజన్ లో కేకేఆర్ కి ట్రోఫీ అందించాడు. గత సీజన్లో పంజాబ్ జట్టుని సైతం ఫైనల్ చేర్చాడు. ఈ ఏడాది కూడా అతడి సారథ్యంలోని కింగ్స్ టీమ్ అద్భుత విజయాలతో దూసుకుపోతుంది. ఇక శ్రేయస్ డొమెస్టిక్ క్రికెట్ లో కూడా ముంబై జట్టుకు ఎన్నో విజయాలను అందించాడు. దీంతో అతడికి జాతీయ జట్టును నడిపించే సత్తా కూడా ఉందని క్రికెట్ పండితులు చెబుతున్నారు. ఇందులో భాగంగా టీ20 జట్టు పగ్గాలు శ్రేయస్ అయ్యర్ కి ఇచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ప్రచారం జరుగుతుంది.



అక్షర గౌడ అద్భుతమైన ఫ్యాషన్ మూమెంట్

# ఇండియా డైరీస్ లో గ్లోబల్ బ్యూటీ స్మృతులు

గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా విదేశాల్లో స్థిరపడినా? మూలాలను, భారతీయ సంస్కృతిని ఎప్పటికీ మర్చిపోరని మరోసారి నిరూపించారు. తాజాగా పీసీ సోషల్ మీడియా వేదికగా పంచుకున్న -ఇండియా డైరీస్- ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. భారతదేశ పర్యటనలో భాగంగా అమ్మడు గడిపిన సాధారణ - ఆహ్లాదకరమైన క్షణాలను ఈ ఫోటోలు ప్రతిబింబిస్తున్నాయి. విలాసవంతమైన హోటళ్లకు భిన్నంగా, అచ్చమైన దేశీ స్టైల్‌లో పీసీ విలువైన సమయాన్ని గడపడం అభిమానులను ఆకట్టుకుంటోంది. ఈ పర్యటనలో ప్రియాంక స్థానిక దాబాలో భోజనం చేస్తూ కనిపించడం విశేషం.దాల్ మఖానీ, అమృత్‌సరి కుల్చా వంటి వంటకాలను ఎంతో ఇష్టంగా ఆస్వాదిస్తోన్న ఫోటోలు భారతీయ ఆహారంపై ఆమెకున్న మక్కువను చాటుతున్నాయి. విదేశీ వంటకాల కంటే దేశీ మసాలాలు, ఘుమఘుమలాడే పంజాబీ వంటకాలే తనకు నిజమైన తృప్తినిస్తాయని పోస్ట్ లో పేర్కొన్నారు. అంతే కాదు అక్కడ వినిపించే స్థానిక సంగీతం కూడా తన పర్యటనకు మరింత ఉత్సాహన్ని నింపిందని వెల్లడించారు. అలాగే ప్రియాంక విశ్రాంతి సమయంలో పాత బాలీవుడ్ చిత్రాలను వీక్షించారు. ముఖ్యంగా అతిలోక సుందరి శ్రీదేవి, సల్మాన్ ఖాన్ నటించిన ఐకానిక్ సినిమాలను చూస్తూ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తన ఎదుగుదలలో ఆ సినిమాల ప్రభావం ఎంతగా ఉందో? పీసీ పరోక్షంగా గుర్తు చేసుకున్నారు. గ్లోబల్ నటిగా ఎదిగినా? తన మూలాలైన బాలీవుడ్ చిత్రాల పట్ల ఆమెకున్న గౌరవం ఫోటోల ద్వారా అర్థమవుతుంది.ముంబై వీధుల్లో లభించే భేల్ పూరీ గురించి ప్రియాంక ప్రత్యేకంగా ప్రస్తావించారు. న్యూస్‌పేపర్ కోన్‌లో లభించే ఆ అచ్చమైన ముంబై స్ట్రీట్ ఫుడ్ రుచిని తాను ఎంతగా మిస్ అవుతున్నారో? వివరించారు. కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా ముచ్చటించడం, ఇంట్లో వండిన సాధారణ భోజనాన్ని ఆస్వాదించడం వంటివి ఆమెకు ఎంతో మానసిక ప్రశాంతతను ఇస్తాయని చెప్పుకొచ్చింది.గ్లోబల్ ఐకాన్‌గా ఎంతో బిజీగా ఉండే పీసీ ఇలాంటి చిన్న చిన్న విషయాల్లోనే అసలైన ఆనందం ఉందని చాటి చెప్పారు. ప్రియాంక చోప్రా షేర్ చేసిన -ఫోటో డంప్- కేవలం పర్యటన విశేషాలే కాదు. ఆమెలోని భారతీయురాలిని మరోసారి ఆవిష్కరించాయి. ఎంత ఎత్తుకు ఎదిగినా? ఒదిగి ఉండటం , దేశ సంస్కృతిని, ఆహారాన్ని గౌరవించడం ఆమె గొప్పతనానికి నిదర్శనం. సినిమాల విషయానికి వస్తే -వారణాసి- సినిమాతో అమ్మడు టాలీవుడ్ లోనూ లాంచ్ అవుతోన్న సంగతి తెలిసిందే. బాలీవుడ్ ని వీడిన తర్వాత అమ్మడు హాలీవుడ్ సినిమాలతోనే బిజీ అయిన సంగతి తెలిసిందే. అలాంటి నటిని దర్శకధీరుడు రాజమౌళి మళ్లీ భారత్ కు తీసుకురావడం విశేషం.




వాణి కపూర్ చిక్ స్టూడియో షూట్‌కు తీరప్రాంత మనోజ్ఞతను తెస్తుంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com